
# ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 29.5
కనిష్ఠం 22.8
****

ANDHRAJYOTHY



ప్రాజెక్టుల నీటిమట్టం

| ప్రాజెక్టు | పూర్తిస్థాయి | ప్రస్తుతం | ఇన్‌ఫ్లో | అవుట్‌ఫ్లో |
|---|---|---|---|---|
| | నీటి మట్టం (అడుగులు) | | (క్యూసెక్కులు) | |
| సాగర్ (టీఎంసీలు) | 590 (312.0450) | 587.50 (305.8030) | 52,560 | 52,560 |
| మూసీ (టీఎంసీలు) | 645 (4.46) | 644.42 (4.31) | 1,517.58 | 1,764.88 |
| పులిచింతల (టీఎంసీలు) | 175 (45.77) | 173.554 (43.548) | 25,230 | 24,230 |

| చికెన్ ధరలు | లైవ్ : రూ.148 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.250 |
|---|---|---|---|



# చివరికి కన్నీళ్లే

ఒకప్పుడు పల్లెలు పచ్చని పైర్లు, స్వచ్ఛమైన నేల, గాలికి నెలవుగా ఉండేవి. మారుతున్న కాలంతో పాటు ప్రస్తుతం అన్నీ కలుషితమవుతున్నాయి. వరి చేలు నేడు పురుగు మందుల వాసనతో గుప్పుమంటున్నాయి. విత్తనం నాటిన మొద లు కోతల వరకు తెగుళ్ల వ్యాప్తితో పంటలు కోలుకోవడం లేదు. రైతులు విపరీతంగా పురుగు మందులు పిచికారీ చేసినా ప్రయోజనం ఉండటం లేదు. పేరుకు హైబ్రిడ్ విత్తనాలు అయినా, దిగుబడులు ఆశించిన స్థాయిలో రావడం లేదు.

- (ఆంధ్రజ్యోతి,మిర్యాలగూడ వ్యవసాయం)

▸ పంటను వెంటాడిన తెగుళ్లు ▸ విచ్చలవిడిగా పురుగుమందుల పిచికారీ ▸ దెబ్బతింటున్న నేల స్వభావం ▸ దిగుబడులపై తీవ్ర ప్రభావం ▸ ఆందోళనలో రైతులు

సాగర్ ఆయకట్టులో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 6.50లక్షల ఎకరాల్లో వరి సాగవుతోంది. 1965లో సాగర్ ప్రాజెక్టు పూర్తయినా నాటి నుంచి నేటివరకు ఆయకట్టులో సుమారు ఏడు దశాబ్దాలుగా వరే ప్రధాన పంటగా సాగవుతోంది. దశాబ్దకాలం నాటి వరకు వానాకాలంలో సాంబమసూరి (బీపీటీ-5204), యాసంగిలో ఎంటీయూ-1010 వరి రకం సాగయ్యేది. తెగుళ్ల వ్యాప్తి, పెట్టుబడులు తక్కువగా ఉండి అధిక దిగుబడులు వచ్చేవి.

### ప్రైవేట్ రకాలతో తంటా..

ఆయకట్టును ప్రస్తుతం ప్రైవేట్ సన్న రకాలు శాసిస్తున్నాయి. దశాబ్దకాలంగా 90శాతం మేర అత్యంత సన్నని వరినే రైతులు పండిస్తున్నారు. పంట కోయగానే నేరుగా మిల్లుకు తరలించే అవకాశం ఉండటంతో పాటు రైతులు పూర్తిస్థాయిలో వీటినే సాగు చేస్తున్నారు.ఈ రకాలు వ్యాపారులకు కల్పతరువుకాగా, రైతులకు మాత్రం గుదిబండగా మారాయి.

### విత్తన దిగుమతి..

సాగర్ ఆయకట్టు వరి సాగులో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో ఉంది. అయినా, విత్తన తయారీలో ముందడుగు పడలేదు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధనా కేంద్రాలు ఏర్పాటు చేసినా, ప్రైవేటు రకాలు మాదిరిగా అత్యంత సన్నని, ఆరబెట్టకుండా విక్రయించే ధాన్యాన్ని నేటి వరకు రూపకల్పన చేయడంలో శాస్త్రవేత్తలు విఫలమయ్యారు. నేడు ఆయకట్టులో సాగు చేసే ప్రైవేటు రకాలు ఎక్కువగా మహారాష్ట్రలో రూపకల్పన చేసినవే. ఈ విత్తనాలు కరీంనగర్, వరంగల్, నిజామాబాద్‌లో ఏర్పాటు చేసిన వందలాది విత్తన కంపెనీల నుంచి ఆయకట్టుకు పెద్ద మొత్తంలో దిగుమతి అవుతున్నాయి. రైతు స్థాయిలో విత్తోనాత్పత్తి ప్రయత్నం జరగకపోవడంతో 10కిలోల విత్తనానికి రూ.1,000పైనే ధర వెచ్చించి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ఎకరా విత్తనానికి రూ.1,500 నుంచి రూ.2వేల వరకు ఖర్చు వస్తోంది.

### విత్తనంలో బెరుకులు.

సన్న విత్తనానికి మార్కెట్లో డిమాండ్ బాగా పెరగడంతో వందలాది విత్తన కంపెనీలు పుట్టుకువచ్చాయి. అయితే విత్తనాల్లో మాత్రం నాణ్యత ఉండటం లేదు. ఈ వానాకాలంలో ఎకరం పంటలో సుమారు 10-30శాతం వరకు బెరుకులు వచ్చాయని రైతులు చెబుతున్నారు. పంట దిగుబడులు ఎకరానికి 3క్వింటాళ్ల మేర తగ్గుతున్నాయి. మిగిలిన బెరుకు విత్తనాలు ప్రధాన విత్తనంలో కలిసిపోవడంతో మార్కెట్లో ధర రాక నష్టపోతున్నామని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### మందుల కల్తీ...

అధిక వర్షాలతో వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా వరిలో తెగుళ్లను నియంత్రించడానికి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎకరానికి ఇప్పటి వరకు మూడు నుంచి నాలుగు పర్యాయాలు మందులు పిచికారీ చేసినా తెగుళ్లు వరుసగా వెంటాడాయి. ఒకేసారి మూడు నుంచి నాలుగు రకాల పురుగు మందులు కలపడంతో పాటు నకిలీ బయో మందులు వాడటంతో పంటలో రోగ నిరోధక శక్తి తగ్గింది. దీంతోపాటు దిగుబడులు తగ్గిపోతాయని, నేల స్వభావంతో పాటు పర్యావరణం దెబ్బతింటోందని శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు.


- మిగతా 8వ పేజీలో...


### తెగుళ్ల బెడద...



ప్రైవేట్ రకాలు అత్యంత సన్నవి కావడంతో ప్రతికూల వాతావరణాన్ని తట్టుకోలేకపోతున్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. పంటలో రోగనిరోధక శక్తి తక్కువగా ఉండటంతో విత్తనం నాటిన నుంచే తెగుళ్లు వెంటాడుతున్నాయి. ఈ ఏడాది వరి ప్రాథమిక దశలోనే ఆకుచుట్టు పురుగు, మొగి, పొట్టకుళ్లు, కంకినల్లి, పాము పొడ, ఎండాకు తెగులు, దోమ, కాటుక తెగుళ్లు సోకాయి. వరికి వచ్చే అన్ని రకాల తెగుళ్ల వ్యాప్తితో పంటల సాగు రైతులకు భారంగా మారింది. ఈ పరిస్థితుల్లో ఎకరానికి 30-35 బస్తాల ధాన్యం దిగుబడులు రావడం కూడా కష్టంగా మారింది.

## తూకాల్లో మోసాలకు
# అడ్డుకట్ట పడేనా?

▸ తప్పుడు తూకాలతో మోసపోతున్నామంటున్న రైతులు
▸ ఫిర్యాదులు అందితే తప్ప స్పందించని అధికారులు



తూకంలో తేడాలున్నట్లు రైతులు ఫిర్యాదు చేయగా మిర్యాలగూడలో వేబ్రిడ్జిని తనిఖీ చేసి తూకాలను సీజ్ చేసిన అధికారులు (ఫైల్)

మిర్యాలగూడ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇంటిల్లిపాది కష్టపడి పండించిన పంట విక్రయానికి రైతులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ధాన్యం విక్రయించేందుకు రైస్‌మిల్లుల వద్దకు వెళ్తే వేబ్రిడ్జి మోసాలకు గురిచేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. పంట కోత సమయంలో కురుస్తున్న వర్షాలతో రైతులు పంటను రక్షించుకుంటూ ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తెస్తే తేమశాతం పేరుతో రోజుల తరబడి కేంద్రాల్లోనే పడిగాపులు పడుతున్నారు. రైస్‌మిల్లుల వద్దకు తాలు, తేమ, రంగు మారిందనే కారణాలతో ధర తగ్గించడమో, లేదా తూకంలో మోసానికి పాల్పడటమో చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ట్రాక్టర్ లోడుకు 40 నుంచి 60 కిలోల వరకు తక్కువ చూపుతున్నారని రైతులు పేర్కొంటున్నారు. ధాన్యం రాబడి తగ్గినప్పుడు ధర పెంచడం, ఎక్కువ ధాన్యం వచ్చినప్పుడు రాత్రికి రాత్రే క్వింటాకు రూ.100 నుంచి రూ.200 వరకు తగ్గిస్తుండటంతో విధిలేని పరిస్థితులో మిల్లరు చెప్పిన ధరకే ధాన్యం విక్రయిస్తున్నారు. గతంలో తూకంలో మోసాలకు పాల్పడుతున్నారని ఫిర్యాదు చేయడంతో కొన్ని కాంటాలపై అధికారులు దాడులుచేసి జరిమానా విధించారు. కాగా, ప్రస్తుతం వానాకాలం పంటల కోతలు ప్రారంభమైనందున తూనికల, కొలతల అధికారులు స్పందించి ముందస్తు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

### ఏటా ఇదే తంతు...

ప్రతీ సీజన్‌లో తూకం పేరుతో మోసం చేస్తున్నారని రైతుల..


మిగతా 8వ పేజీలో...


## ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



కనగల్ మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వర్షాలను దృష్టిలో ఉంచుకొని ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. బుధవారం తన ఛాంబర్‌లో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యం సరైన తేమ, నాణ్యత ప్రమాణాలు ఉంటే తక్షణమే కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలన్నారు. ఎక్కువ రోజులు కొనుగోలు కేంద్రాల్లోనే ఉంచితే వర్షానికి తడిచే ప్రమాదం ఉందన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని అప్పటికప్పుడే మిల్లులకు తరలించాలని సూచించారు. రైతులు నాణ్యతతో కూడిన ధాన్యాన్ని తీసుకురావాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, ఆర్డీవో వై.అశోక్ రెడ్డి, ధాన్యం సేకరణ జిల్లా ప్రత్యేక అధికారి నాగేశ్వరరావు, మార్కెటింగ్‌శాఖ ఏడీ ఛాయాదేవి, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ గోపీకృష్ణ, జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేష్, డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి, జిల్లా సహకార అధికారి పత్యా నాయక్, తదితరులు పాల్గొన్నారు.

### జాప్యం లేకుండా దిగుమతి చేయాలి

(ఆంధ్రజ్యోతి, కనగల్): ఐకేపీ కేంద్రాల నుంచి లారీల్లో వచ్చే ధాన్యాన్ని జాప్యం లేకుండా దిగుమతి చేసుకోవాలని మిల్లర్లను కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. బుధవారం మండలంలోని దోరెపల్లి స్టేజీ వద్ద ఉన్న శ్రీవెంకటసాయి రైస్ మిల్లును కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కొర్రీలు లేకుండా ధాన్యం దిగుమతి చేసుకోవాలన్నారు. మిల్లుకు 80వేల క్వింటాళ్ల ధాన్యం లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 20వేల క్వింటాళ్లు వచ్చిందని కలెక్టర్‌కు రైస్‌మిల్లు నిర్వాహకుడు శ్రీనివాస్ వివరించారు. ఆమె వెంట అదనపు కలెక్టర్ శ్రీనివాస్, తహసీల్దార్ పద్మ, ఎస్‌ఏ విఘ్నేశ్వర్‌రెడ్డి, ఆర్‌ఐ సునిత, యాదయ్య, ఏపీఎం మైసేశ్వర్‌రావ్, తదితరులు ఉన్నారు.

## తేమ, తాలు లేకుండా చూడాలి

జడ్పీ సీఈవో శ్రీనివాసరావు



చీకటిగూడెం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీచేస్తున్న జడ్పీ సీఈవో శ్రీనివాసరావు

కేతేపల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ధాన్యంలో నిర్ణీత శాతానికి మించి తేమ, తాలు లేకుండా చూడాలని జడ్పీ సీఈవో బి.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని చీకటిగూడెం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రంలో మౌలిక వసతులు, కొనుగోలు చేసి ధాన్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతులు కొనుగోలు కేంద్రానికి తెచ్చే ధాన్యంలో తేమ అధికంగా ఉండకుండా చూసుకోవాలన్నారు. తేమ ఎక్కువగా ఉంటే ఆరబెట్టాలని సూచించారు. అలాగే కేంద్రాల నిర్వాహకులు సైతం కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించి ట్రక్ షీట్లు తీసుకోవాలన్నారు. ధాన్యం విక్రయించిన రైతులకు సకాలంలో మద్దతు ధరతో బిల్లుల చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అంతకముందు మండల పరిషత్ కార్యాలయంలో అభివృద్ధి పనులను సమీక్ష నిర్వహించారు. ఆయన వెంట ఎంపీడీవో బి.శ్రీనివాసరావు, వ్యవసాయాధికారి బి.పురుషోత్తం, ఏఈవో బాలరాజు, తదితరులు ఉన్నారు.

## కార్తీకమాసం ప్రారంభం



కార్తీక పూజల్లో పాల్గొన్న భక్తులు

నల్లగొండ కల్చరల్, అక్టోబరు 22( ఆంధ్రజ్యోతి): కార్తీక మాస పూజలు బధవారం ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా పలు దేవాలయాల్లో కార్తీక మాసం సందర్భంగా గణపతి పూజ, అఖండ దీపారాధన, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. ఆలయాలన్నీ భక్తులతో సందడి చేశాయి. నెల రోజుల పాటు ఆలయాల్లో కార్తీక మాస పూజలు కొనసాగనున్నాయి. నల్లగొండ పట్టణంలోని పానగల్ పచ్చల సోమేశ్వర ఆలయం, ఛాయాసోమేశ్వర ఆలయం, తులసీనగర్‌లోని భక్తాంజనేయస్వామి దేవాలయం, వీటీ కాలనీ వేంకటేశ్వర స్వామి ఆలయం, రామగిరి సీతారామచంద్ర స్వామి దేవాలయం, బీట్ మార్కెట్‌లోని రామకోటి స్తూప ఆలయం, శివాజీనగర్‌లోని పార్వతి పరమేశ్వర స్వామి ఆలయంతో పాటు శైవ, వైష్ణవ ఆలయాల్లో కార్తీక మాస పూజలు శాస్త్రోక్తంగా ఆరంభమయ్యాయి.

## సాగర్ విద్యుత్ కేంద్రం ముందున్న రాళ్ల తొలగింపు

జెన్‌కో సివిల్ డైరెక్టర్ అజయ్



నాగార్జునసాగర్ కొత్త వంతెన వద్ద టెయిల్‌పాండ్‌కు నీరు వెళ్లే మార్గాన్ని పరిశీలిస్తున్న డైరెక్టర్ అజయ్, తదితరులు

నాగార్జునసాగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ముందున్న రాళ్లు రివర్సబుల్ పంపింగ్‌కు అడ్డుగా ఉన్నాయని, వాటిని తొలగిస్తామని జెన్‌కో సివిల్ డైరెక్టర్ అజయ్ తెలిపారు. బుధవారం ఆయన ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తిని పరిశీలించారు. అనంతరం ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ముందున్న రాళ్లు, గుట్టలను ఐదు కిలోమీటర్ల దూరం ఉన్న చింతలపాలెం వరకు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ సాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో మొత్తం ఎనిమిది టర్బైన్‌లు ఉండగా, అందులో ఏడు టర్బైన్‌లు రివర్సబుల్ పంపింగ్ సామర్థ్యం కలిగి ఉన్నాయని తెలిపారు. దీంతో జలాశయంలో నీటి లభ్యత తక్కువగా ఉన్నపుడు ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ముందు టెయిల్‌పాండ్ వరకు నిల్వ ఉన్న నీటిని రివర్సబుల్ పంపింగ్ ద్వారా తిరిగి జలాశయంలోకి తీసుకోవచ్చునని తెలిపారు. ఇలా నీటిని రివర్సబుల్ పంపింగ్ తీసుకునే సమయంలో ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి ముందు నదిలో రాళ్లు, గుట్టలు అడ్డుగా ఉండటంతో సరిపడా నీరు పంపింగ్ కావడం లేదని తెలిపారు. అందుకే ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి ముందు భాగంలో ఉన్న రాళ్లు, గుట్టల తొలగింపునకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఇందుకు ఢిల్లీకి చెందిన వ్యాప్‌కో అనే ప్రైవేటు సంస్థకు పనులు అప్పగించామని, ఆ సంస్థ రెండు నెలలక్రితం ప్రధాన జలవిద్యుత్ కేంద్రం టెయిల్ రేస్ (ప్రధాన జలవిద్యుత్ కేంద్రం నుంచి బయటకు నీరు వెళ్లే మార్గం) నుంచి 21 కిలో మీటర్ల దూరంలో ఉన్న టెయిల్ పాండ్ వరకు ఆ సంస్థ శాటిలైట్, జియాలజికల్ సర్వే నిర్వహించిందన్నారు. ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి ముందున్న రాళ్లను అవసరమైతే బ్లాస్టింగ్ చేసి తొలగిస్తామన్నారు. ఇందుకు సంబంధించిన పనులకు సుమారు రూ.6కోట్లు ఖర్చవుతుందని, త్వరలో పనులు చేపడతామని తెలిపారు. తొలగించిన రాళ్లు, గుట్టలను తొలగించి ఎక్కడ డంపింగ్ చేయాలి?, ఎంత మేరకు తొలగించాలి? అనే విషయాన్ని పరిశీలిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జెన్‌కో హైడల్ సీఈ నారాయణ, సాగర్ జెన్‌కో సీఈ మంగేష్‌కుమార్, ఎస్ఈలు రఘురాం, రామకృష్ణరెడ్డి, జెన్‌కో డీఈలు, ఇతర ఇంజనీర్లు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారంలో పీఆర్టీయూ ముందంజ

ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి



పీఆర్టీయూ భవన్‌లో ధర్మారెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

నల్లగొండ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో పీఆర్టీయూ టీఎస్ సంఘం ముందంజలో ఉందని ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి జిల్లా కేంద్రంలో నిర్వహించిన సంఘం జిల్లా సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న పదోన్నతులు, బదిలీలు, 317 ఉపాధ్యాయుల పరస్పర బదిలీలు, మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల బదిలీలు, కేజీబీవీ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించామన్నారు. పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీపై సీఎంతో పాటు మంత్రులతో చర్చించి అమలుకు కృషి చేస్తానన్నారు. సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు కోసం కేంద్ర విద్యాశాఖ మంత్రి కలుస్తామన్నారు.

### ధర్మారెడ్డి సేవలు మరువలేనివి

ఉపాధ్యాయ వర్గానికి పీఆర్టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ బీరెల్లి ధర్మారెడ్డి అందించిన సేవలు మరువలేనివని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని పీఆర్టీయూ భవన్‌లో ఏర్పాటు చేసిన ధర్మారెడ్డి విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఉపాధ్యాయుల సంక్షేమం, విద్యా వ్యవస్థ పటిష్టతకు ధర్మారెడ్డి చేసిన సేవలు నేటి తరానికి ఆదర్శంగా నిలిచాయన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, విద్యా వ్యవస్థ పరిరక్షణ కోసం పీఆర్టీయూ నిరంతరం సేవలు అందిస్తోందన్నారు. మాజీ ఎమ్మెల్సీ మోహన్ రెడ్డి మాట్లాడుతూ, ధర్మారెడ్డి ఉపాధ్యాయుల లోకానికి దిక్సూచి వంటి వారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు పలు సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వంతో రాజీలేని పోరాటం చేసి జీవోలు సాధించారన్నారు. పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పులగం దామోదర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుంకరి భిక్షంగౌడ్ మాట్లాడుతూ, ధర్మారెడ్డి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కాళం నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి మేకల జాన్‌రెడ్డి, నాయకులు సిరందాసు సత్తయ్య, పేరి వెంకట్‌రెడ్డి, జగన్‌మోహన్ గుప్తా, శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి నర్సింహారెడ్డి, వెంకట్‌రెడ్డి, మధుసూదన్‌రావు, సీతరాంచందర్‌రావు, సుదర్శన్‌రెడ్డి, యుగేందర్ రెడ్డి, ఫణికుమార్, రవీందర్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, సాయిరాంరెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నత లక్ష్యాలు ఏర్పర్చుకోవాలి

డీఈవో భిక్షపతి



విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఈవో భిక్షపతి

కొండమల్లేపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పర్చుకొని జీవితంలో ఎదగాలని డీఈవో భిక్షపతి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను ఆయన తనిఖీచేశారు. ఈ సందర్భంగా మెనూ వివరాలు, రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మంచిగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఆయన వెంట ఎస్‌వో కత్తుల సరళ, తదితరులు ఉన్నారు.

## వేబ్రిడ్జిల తనిఖీలు చేపట్టాలి



వినతిపత్రం అందజేస్తున్న లింగారెడ్డి

మిర్యాలగూడ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రైస్‌మిల్లుల వద్ద వున్న వేబ్రిడ్జిలను ముందస్తు తనిఖీ చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ మండల అధ్యక్షులు కొణతం లింగారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సబ్‌కలెక్టర్ నారాయణ్ అమిత్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మిర్యాలగూడ ప్రాంతంలో ప్రతీ సీజన్‌లో రైతులను మిల్లర్లు తూకాల్లో మోసానికి గురిచేస్తున్నారని అన్నారు. గత ఏడాది ఓ మిల్లులో ట్రాలీ ధాన్యం తూకంలో 40 కిలోలు తక్కువగా వచ్చినట్లు అధికారులు గుర్తించారని అన్నారు. ఒక్కో మిల్లు సుమారు రోజుకు రూ.1.80లక్షల వరకు తూకంలో మోసంతో దోచుకుంటున్నారని ఆరోపించారు. ఇదీ కాకుండా ట్రాక్టర్‌కు 30కిలోల చొప్పున మిల్లర్లు తరుగు తీస్తున్నారని అన్నారు. రైతులు ప్రశ్నిస్తే హమాలీ, దడవాయి ఖర్చు అని చెప్పి ట్రాక్టర్‌కు అదనంగా రూ.400 దోచుకుంటున్నారని అన్నారు. ఇదేంటని రైతులు రోడ్డెక్కితే వారిని బెదిరింపులకు గురిచేసి మిల్లును మూసివేస్తున్నారని ఆరోపించారు. మోసాలకు పాల్పడిన వేబ్రిడ్జిలను సీజ్ చేసినట్లు అధికారులు ప్రకటిస్తున్నా, జరిమానా చెల్లించి మరుసటి రోజే ప్రారంభిస్తున్నారని విమర్శించారు. వ్యాపారుల మోసాలకు రైతులు బలికాకుండా ముందస్తు తనిఖీలు చేపట్టాలని కోరారు.

## విద్యార్థులతో చెలగాటమాడుతున్న ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు

నల్లగొండ టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు అన్నారు. బుధవారం సంఘం కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయకుండా సీఎం రేవంత్‌రెడ్డి విద్యార్థులను మోసం చేస్తున్నారన్నారు. మూడేళ్లుగా రాష్ట్ర వ్యాప్తంగా రూ.8వేల కోట్లకు పైగా ఫీజులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఫీజులు రాకపోవడంతో ప్రైవేట్ కళాశాలలు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 30న విద్యాసంస్థల బంద్ నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్, సైదానాయక్, కోరే రమేష్, రవీందర్, కిరణ్, రవి, ప్రసన్న, జగన్‌నాయక్, జగదీష్, సైఫ్, నవదీప్, పాల్గొన్నారు.

# ఆహ్లాదం.. అజిలాపురం బుగ్గజలపాతం

**ఎత్తయిన కొండల నుంచి జాలువారుతున్న జలపాతం. వాటి మధ్య పరుచుకున్న ప్రకృతి పచ్చదనం, చల్లటి గాలులు, పక్షుల కిలకిల రావాలతో నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం అజిలాపురం బుగ్గజలపాతం పర్యాటకులను మైమరిపిస్తోంది. గ్రామశివారులోని 2500 ఎకరాల్లోని అడవిలో అడుగడుగునా ప్రకృతి రమణీయతే కనిపిస్తుంది.**

(ఆంధ్రజ్యోతి-మర్రిగూడ)

మర్రిగూడ మండలం అజిలాపురం గ్రామ శివారులో 2500 ఎకరాల్లో విస్తరించి ఉన్న అడవులు వానాకాలంలో పచ్చదనంతో ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. చుట్టూ ఉన్న కొండలపై నుంచి జాలువారే నీరు జలపాతాలను తలపిస్తున్నాయి. వర్షాలు బాగా కురిస్తే ఆరు



జలధార వద్ద పర్యాటకులు

నెలల పాటు ఈ జలపాతాలు కనులవిందు చేస్తుంటాయి. ఎగువ నుంచి వస్తున్న వర్షపు నీరు జలధారగా ఎత్తయిన కొండచరియల మీద నుంచి దూకుతూ కనువిందు చేస్తున్నాయి. ఈ మనోహర దృశ్యాలను చూసేందుకు వివిధప్రాంతాల నుంచి పర్యాటకులు నిత్యం ఇక్కడికి వస్తున్నారు. కుటుంబ సమేతంగా వచ్చి బుగ్గజలపాతంలో తడిసి ముద్దవుతున్నారు. ఇక్కడే వంటా వార్పు చేసుకుని ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆహ్లాదం మధ్య సేదతీరుతున్నారు.

### రెండు కిలోమీటర్ల కాలినడక

దూరప్రాంతాల నుంచి బుగ్గజలపాతాన్ని చూసేందుకు వచ్చే పర్యాటకులకు అక్కడే కొలువుదీరిన బుగ్గ లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఆధ్యాత్మిక చింతన పెంపొందిస్తోంది. దేవాలయం పక్కనే వాహనాలు నిలిపి బుగ్గ జలపాతాన్ని చూసేందుకు కాలిబాటలో రెండు కిలోమీటర్ల మేర కొండచరియల వెంట పచ్చనిచెట్ల మధ్య ప్రకృతిఅందాలను ఆస్వాదిస్తూ నడవడం పర్యాటకులకు సంతృప్తిని ఇస్తోంది.

### పర్యాటక కేంద్రంగా గుర్తించాలి



బుగ్గజలపాతాన్ని రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి. ఎత్తయిన కొండల మధ్య జారువారుతున్న నీటిప్రవాహాన్ని చూసేందుకు వచ్చే పర్యాటకులకు వసతులు లేక ఇబ్బంది పడుతున్నారు. ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దితే అభివృద్ధి చెందుతుంది.

చందునాయక్, సామాజిక కార్యకర్త



జాలువారుతున్న బుగ్గ జలపాతం

## మరణించినా మరొకరిలో జీవిస్తూ..

● నార్కట్‌పల్లి యువకుడి బ్రెయిన్‌డెడ్ ● అవయవదానం చేసిన కుటుంబసభ్యులు



శ్రీహర్షయాదవ్ (ఫైల్ ఫొటో)

నార్కట్‌పల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లికి చెందిన యువకుడు బ్రెయిన్‌డెడ్ కాగా, కుటుంబ సభ్యులు అతడి అవయవాలు దానంచేసి ఆదర్శంగా నిలిచారు. భౌతికంగా లేకున్నా మరొకరి రూపంలో బతికే ఉంటాడని జీవన్‌దాన్ ట్రస్ట్ నిర్వాహకుల సూచనల మేరకు యువకుడి కుటుంబ సభ్యులు ఇందుకు అంగీకరించారు. నార్కట్‌పల్లికి చెందిన నడింపల్లి బలరాంసత్తయ్య, హేమలతల కుమారుడు శ్రీహర్షయాదవ్(21) రంగారెడ్డి జిల్లా బాటసింగారం సమీపంలోని బ్రిలియంట్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 18వ తేదీన కళాశాల ముగిసిన అనంతరం ఇంటికి బయలుదేరే క్రమంలో రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ వైపునకు వెళ్తున్న గుర్తుతెలియని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర రక్తస్రావమైన శ్రీహర్షయాదవ్‌ను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, బ్రెయిన్‌డెడ్ అయ్యిందని వైద్యులు నిర్ధారించారు. నాలుగు రోజులపాటు వెంటిలేటర్‌పై ఉంచిన కుటుంబసభ్యులు, వైద్యుల సూచన మేరకు మంగళవారం తమ కుమారుడి అవయవాలను దానం చేసేందుకు అంగీకరించారు. శ్రీహర్ష గుండె, ఊపిరితిత్తులు, కాలేయం, కిడ్నీలను ఆయా ఆసుపత్రుల వారికి గ్రీన్‌ఛానల్ ద్వారా ప్రత్యేక అంబులెన్స్‌లో తరలించారు. అనంతరం గౌరవ సూచకంగా వందన సమర్పణ చేసి భౌతికకాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. బంధువులు, స్నేహితుల అశ్రునయనాల మధ్య శ్రీహర్ష యాదవ్ అంత్యక్రియలు బుధవారం నార్కట్‌పల్లిలో ముగిశాయి.

## కొబ్బరికాయల ధరలకు రెక్కలు

● కార్తీకమాసం కావడంతో డిమాండ్

● రూ.35 నుంచి రూ.45 పలుకుతున్న ధరలు

● భక్తులకు తప్పని తిప్పలు

**పూజల్లో వినియోగించే ప్రధానమైన కొబ్బరికాయల ధరలకు రెక్కలొచ్చాయి. అత్యంత ప్రీతికరమైన కార్తీకమాసంలో నిత్యం ఆరాధనలు, పూజలు కొనసాగుతాయి. ఆలయాలు, క్షేత్రాలను భక్తులు విరివిగా దర్శించుకుంటారు. ఈ సమయంలో కొబ్బరికాయలకు డిమాండ్ మరింతగా ఉంటుంది. అయితే కొద్దికాలంగా వాటి ధరలు పెరిగిపోయాయి. గతంలో రూ.20లు పలికే కొబ్బరికాయ ధర ప్రస్తుతం రూ.35 నుంచి రూ.45 వరకు పలుకుతోంది.**

(ఆంధ్రజ్యోతి-చింతపల్లి)



కార్తీకమాసంలో వేకువజామునే దేవతారాధన ప్రధానంగా ఉంటుంది. ఇంట్లో పూజలతో పాటు భక్తులు తరుచూ ఆలయాలను సందర్శిస్తుంటారు. ఆలయాలు, క్షేత్రాల్లో సైతం ఈ మాసాంతం ప్రత్యేక పూజా కార్యక్రమాలు కొనసాగుతుంటాయి. పూజల్లో ప్రధానంగా వినియోగించే కొబ్బరికాయల ధరలు రెండు నెలలుగా పెరుగుతూనే ఉన్నాయి. దీంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొబ్బరికాయలను పత్రం, పుష్పం, ఫలం తోయంగా భావిస్తుంటారు. దీంతో ఈ మాసంలో మంచి డిమాండ్ ఉంటుంది.

### పూజలకు ప్రత్యేక మాసం

కార్తీకమాసం పూజలకు, దైవారాధనలకు ప్రత్యేకం. శివుడికి ఇష్టమైన మాసాల్లో కార్తీక మాసం ఒకటి. దీంతో ఈ మాసంలో ఉపవాసాలతో పాటు పూజలు చేస్తుంటారు. అదేవిధంగా అయ్యప్ప, ఆంజనేయస్వామి, శివభక్తుల మాలాధారణ చేస్తుంటారు. మండలం పాటు(40 రోజులు) చేపట్టే దీక్షను ఈ మాసంలోనే చాలామంది ప్రారంభిస్తారు. దీంతో ఎక్కడ చూసినా ఆధ్యాత్మిక వాతావరణం కనిపిస్తుంటుంది. డిసెంబరులో శబరిమలలో జరిగే ప్రత్యేక పూజలకు హాజరయ్యే భక్తులు ఈ మాసంలోనే మాలధారణ చేస్తుంటారు. దీంతో ఆలయాలు భక్తులతో కిక్కిరిస్తుంటాయి.

### పెరిగిన డిమాండ్.. తగ్గిన దిగుబడి

ఉమ్మడి నల్లగొండ జిల్లాకు కొబ్బరికాయలు ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు రాష్ట్రాల నుంచి దిగుమతి అవుతుంటాయి. నల్లగొండ జిల్లా చింతపల్లి మండలానికి గతంలో వారానికి రెండు లారీల కొబ్బరికాయలు సరఫరా అవుతుండేవి. ప్రస్తుతం వారానికి ఒక లారీని మాత్రమే సరఫరా చేస్తున్నారని స్థానిక వ్యాపారులు తెలుపుతున్నారు. అయితే కొద్దికాలంగా పంట దిగుబడి లేకపోవడం, ప్రస్తుతం మార్కెట్‌లో డిమాండ్ ఉండటంతో కొబ్బరికాయల ధరలకు డిమాండ్ పెరిగింది. సరఫరా అయిన కొబ్బరికాయలు కూడా చిన్నవిగా ఉంటున్నాయని, కేవలం ఐదు రోజుల వరకు మాత్రమే నిల్వ ఉంటున్నాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. గతంలో రూ.20లు పలికిన కొబ్బరికాయ ప్రస్తుతం రూ.35 నుంచి రూ.45 వరకు విక్రయిస్తున్నారు. ఇదిలా ఉండగా వ్యాపారులు సిండికేట్ కావడమే కారణమని పలువురు ఆరోపిస్తున్నారు.



### ధరలు కొండెక్కాయి



నిత్యం మా ఇంట్లో పూజలు చేసి అనంతరం దేవాలయాలకు వెళ్తుంటా. ఆలయానికి వెళ్లాలంటే పసుపు, కుంకుమ పువ్వులు, పండ్లు, కొబ్బరికాయతో వెళ్లి పూజలు చేస్తుంటా. నెల రోజుల క్రితం రూ.20 ఉన్న కొబ్బరికాయ ధర ప్రస్తుతం రూ.40కి చేరింది. గ్రామీణప్రాంతాల్లో రూ.40 నుంచి 45 వరకు విక్రయిస్తున్నారు. దిగుమతి చేసిన కొబ్బరికాయులు చిన్నవిగా ఉండటంతో వెంటనే కుళ్లిపోతున్నాయి.

కొండూరి శ్రీదేవి, మాజీ సర్పంచి (గొడకొండ్ల).

## యువకుడి ఆత్మహత్య

రాజాపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలం కొండ్రెడిచెరువు గ్రామంలో యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన కర్రె కనుకయ్య వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నారు. ఆయనకు ఇద్దరు భార్యలు కాగా ముగ్గురు కుమారులు. మొదటి భార్యకు ఇద్దరు కుమారులు ఉండగా 13ఏళ్ల కిందట ఆమె మృతి చెందింది. మొదటి భార్య పెద్దకుమారుడు మహేష్(22) తండ్రికి వ్యవసాయంలో సాయంగా ఉంటున్నాడు. కనుకయ్య తల్లి పెంటమ్మ ఆరోగ్యం బాగా లేకపోవడంతో రెండు రోజుల కిందట ఆర్‌వీఎం ఆసుపత్రిలో చేర్పించారు. మంగళవారం తండ్రి, కుమారుడు కనుకయ్య, మహేష్‌లు ఇంటికి వచ్చారు. ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో గదిలో మహేష్ ఉరివేసుకున్నాడు. బుధవారం గది తలుపులు తెరిచి చూడగా ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. మహేష్ మృతికి సంబంధించి ఎవరిపై అనుమానం లేదని తండ్రి కనుకయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అనిల్‌కుమార్ తెలిపారు.

## ఎపిక్ ఫైల్స్‌ను డౌన్‌లోడ్ చేయొద్దు



సూర్యాపేట క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : సైబర్ మోసగాళ్లు వాట్సాప్ గ్రూపుల్లో నకిలీ ఎపిక్ ఫైల్స్‌ను పంపి మోసాలకు పాల్పడుతున్నారని, ఆ తరహా వాట్సాప్ మెసేజ్‌లను ప్రజలు డౌన్‌లోడ్ చేయవద్దని సూర్యాపేట జిల్లా ఎస్పీ కొత్తపల్లి నర్సింహ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సైబర్ నేరగాళ్లు ఎపిక్ ఫైల్స్‌ను ఆర్‌టీవో, టీఎస్ చలాన్ యాప్‌లు వంటి వాటిని విస్తృతంగా ప్రచారం చేస్తున్నారని తెలిపారు. వాటిని డౌన్‌లోడ్ చేయడం వల్ల సెల్‌ఫోన్లు హ్యాక్‌కు గురై సైబర్ మోసం జరుగుతోందన్నారు. ఎవరైనా ఈ ఫైల్స్‌ను క్లిక్ చేసి ఇన్‌స్టాల్ చేసినప్పుడు, హానికరమైన సాఫ్ట్‌వేర్ ద్వారా హ్యాక్‌కు గురై బాధితుడికి తెలియకుండా, అనుమతి లేకుండా మోసగాళ్లకు ఓటీపీ సందేశాలతో ఆటోమేటిక్ మెసేజ్ ఫార్వర్డ్‌ను అనుమతిస్తోందన్నారు. ఈ పద్ధతి ద్వారా సైబర్ నేరగాళ్లు బాధితుల బ్యాంకు ఖాతాల నుంచి మోసపూరితంగా డబ్బును దొంగిలిస్తున్నారని ప్రకటనలో వివరించారు. అందుకోసం నకిలీ ఆర్‌టీవో చలాన్ యాప్‌లు, పీఎం కిసాన్ ఏపీకేలు, ఎస్‌బీఐ యోనో, కస్టమర్ కేర్ యాప్‌లు సోషల్ మీడియాలో ప్రసారం అవుతున్న ఏమైనా ఇతర అనుమానాస్పద ఎపిక్ ఫైల్స్ వంటి వాటి వివరాలను వెంటనే పోలీసులకు తెలపాలన్నారు. ప్రజలు ఏమైనా మోసపూరిత యాప్స్‌ను గుర్తిస్తే వెంటనే సైబర్ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు ఫోన్ చేయాలన్నారు.

## విద్యుదాఘాతంతో ఆవు మృతి



విద్యుదాఘాతంతో మృతి చెందిన ఆవు

రామన్నపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలో విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందింది. ఈ ఘటన బుధవారం జరిగింది. రామన్నపేటలోని బీసీ కాలనీకి చెందిన రైతు మోటె రాజుకు సొంత వ్యవసాయ భూమి ఉంది. వ్యవసాయ పశుపోషణ చేస్తూ రాజు జీవనం సాగిస్తున్నారు. బుధవారం ఉదయం ఆవును మేతకు వదలగా సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్త్‌వైర్ తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. రూ. 60వేల విలువైన ఎదకు వచ్చిన ఆవు మృతి చెందడంతో రైతు రాజు కన్నీటి పర్యంతమయ్యాడు.

## కుక్కల దాడిలో ఆరు గొర్రెలు మృతి

ఆత్మకూరు(ఎస్), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలంలో కుక్కల దాడిలో గొర్రెలు మృతి చెందాయి. మండలంలోని బోట్యాతండా పంచాయతీ పరిధికి చెందిన భూక్యా టీక్యాకు చెందిన గొర్రెలపై మంగళవారం రాత్రి కుక్కలు దాడి చేశాయి. ఈ దాడిలో ఆరు గొర్రెలు మృతి చెందడంతో రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు రైతు తెలిపాడు. మరికొన్ని గొర్రెలు గాయపడినట్లు తెలిపారు. టీక్యాను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

## అప్పుపత్రాల కోసం మద్యం తాగించి వృద్ధురాలి హత్య



విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కొత్తపల్లి నర్సింహ

సూర్యాపేట క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలో ఈ నెల 14న వృద్ధురాలి హత్య కేసును హుజూర్‌నగర్ పోలీసులు ఛేదించారు. బంగారు ఆభరణాలు, అప్పుపత్రాల కోసం మద్యం తాపించి మత్తులోకి వెళ్లాక వృద్ధురాలిని హత్య చేసిన ముగ్గురిని రిమాండ్‌కు తరలించారు. కేసుకు సంబంధించిన వివరాలను జిల్లా ఎస్పీ కొత్తపల్లి నర్సింహ బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వెల్లడించారు. హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వఆస్పత్రి వెనుక నివసిస్తున్న చెన్న అనసూర్యమ్మకు ఇద్దరు కుమారులు. ఓ కుమారుడు నకిరేకల్‌లో ఉంటుండగా, ఆమెతో పాటు ఉండే కుమారుడు వేణు వారణాసిలో వంటలు చేయడానికి వెళ్లాడు. అనసూర్యమ్మ ఇంట్లో ఒంటరిగా ఉంది. ఇదిలా ఉండగా ఇదే పట్టణంలోని యాదవుల బజారుకు చెందిన సుతారీ పని చేసే లింగం సతీష్‌కు ఆమె గతంలో రూ.50 వేలు ఇవ్వగా అతడు వడ్డీ చెల్లిస్తున్నాడు. ఈ నెల 14 రాత్రి సమయంలో సతీష్ అతడి మేనల్లుడు భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా భద్రాచలం ప్రాంతానికి చెందిన మైనర్‌తో అనసూర్యమ్మ ఇంటికి వెళ్లారు. ఆమెకు మద్యం ఇచ్చి, అది సేవించి మత్తులోకి వెళ్లాక ఇద్దరు కలిసి అనసూర్యమ్మ నోరు, ముక్కు మూసి హత్యచేశారు. అనంతరం ఆమె ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలు, ఇంట్లో భద్రపరిచిన సతీష్ రాసిఇచ్చిన రూ.50వేల తాలుకూ ప్రామిసరీ నోటును తీసుకుని వెళ్లిపోయారు. ఆ తర్వాత జరిగిన విషయాన్ని సతీష్ తన భార్య మౌనికకు తెలిపాడు. నిందితులు ముగ్గురు కలిసి చోరీచేసిన బంగారు ఆభరణాలను విజయవాడకు తీసుకెళ్లి అక్కడ కరిగించి బంగారు ముద్దలుగా మార్చుకుని భద్రపర్చుకున్నారు. ఈ నెల 15న ఉదయం అనసూర్యమ్మ నిద్రలేవకపోయేసరికి స్థానికులు ఇంట్లోకి వెళ్లి చూడగా మృతి చెంది ఉంది. దీంతో హుజూర్‌నగర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని అనసూర్యమ్మ మృతికి కారణాలను తెలుసుకుని, ఘటనాస్థలంలో ఆధారాలను సేకరించారు. అనసూర్యమ్మ శరీరంపై గాయం ఉండడం, ఆమె ఒంటిపై బంగారు ఆభరణాలు లేకపోవడంతో హత్యగా నిర్ధారించుకున్నారు. దర్యాప్తులో భాగంగా సాంకేతిక ఆధారాల ప్రకారం లింగం సతీష్, అతడి భార్య మౌనిక, మేనల్లుడైన మైనర్ బాలుడిపై అనుమానంతో విచారించగా అనసూర్యమ్మను హత్య చేసింది తామేనని అంగీకరించారు. వారిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.3.60లక్షల విలువ చేసే బంగారు ముద్దలు, అప్పుకు సంబంధించిన ప్రామిసరీ నోటును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. బాలుడిని కోర్టు అనుమతితో జువైనల్ హోంకు తరలిస్తున్నామని ఎస్పీ తెలిపారు. సమావేశంలో హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు, కానిస్టేబుళ్లు నాగరాజు, శంభయ్య ఉన్నారు.

## వివాహేతర సంబంధం నెరుపుతుందనే హత్య

ఆత్మకూరు(ఎస్), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : కొరివి భిక్షమమ్మ వివాహేతర సంబంధం నెరుపుతుందన్న కారణంగానే హత్య చేసినట్లు సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) ఎస్‌ఐ శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఈ విషయంలో ఇటీవల పంచాయితీ జరిగిందని, అయినప్పటికీ ఆమెలో మార్పు రాకపోవడంతో అవమానంగా భావించి పథకం ప్రకారం కారుతో ఢీకొట్టి కత్తితో గొంతుకోసి హత్య చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. భిక్షమమ్మ సోదరుడు గుండాల నర్సయ్య ఫిర్యాదుమేరకు భిక్షమమ్మ భర్త కొరివి మల్లయ్యతో పాటు చిన్నకుమారుడు ప్రవీణ్, అన్న కుమారుడు మహేష్, అతడి మిత్రులు వంశీ, జనార్ధన్‌లపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఇదిలా ఉండగా బుధవారం సూర్యాపేట జిల్లా జనరల్ ఆసుపత్రిలో భిక్షమమ్మ మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఏపూరు గ్రామంలో ఆమె పెద్దకుమారుడు భరత్ అంత్యక్రియలు నిర్వహించారు.

## షార్ట్‌సర్క్యూట్‌తో సెలూన్ దుకాణం దగ్ధం



దగ్ధమైన సెలూన్‌ను పరిశీలిస్తున్న నాయకులు

ఆలేరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో హెయిర్‌కటింగ్(సెలూన్) దుకాణం దగ్ధమైంది. ఈ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలో మంగళవారం రాత్రి జరిగింది. సీఐ యాలాద్రి, దుకాణ యజమాని బొప్పాపురం కృష్ణయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.మండలంలోని గుండ్లగూడెం గ్రామానికి చెందిన కృష్ణయ్య ఆలేరులోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో అద్దె గదిలో సెలూన్ నిర్వహిస్తున్నాడు. మంగళవారం దుకాణానికి సెలవు ఉండడంతో తెరవలేదు. రాత్రి సమయంలో దుకాణం లోపల నుంచి పొగలు రావడాన్ని గమనించిన స్థానికులు కృష్ణయ్యకు, ఫైర్‌స్టేషన్‌కు సమాచారమిచ్చారు. ఫైరింజన్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను చల్లార్చారు. అప్పటికే కుర్చీలు, సోఫాలు, హెయిర్‌కటింగ్ సామాగ్రి కాలిబూడిదయ్యాయి. ఘటనా స్థలాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు ఎజాజ్ బుధవారం సందర్శించి, కృష్ణయ్యను పరామర్శించారు. విషయాన్ని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యకు ఫోన్‌లో వివరించారు. ప్రభుత్వం నుంచి పరిహారానికి కృషి చేస్తానని తెలిపారు. కృష్ణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ యాలాద్రి తెలిపారు.

## సరిహద్దులోని ఆర్టీఏ చెక్‌పోస్టుల మూసివేత

● ఉమ్మడి నల్లగొండలో మూడు చోట్ల చెక్‌పోస్టులు

● రాష్ట్ర రవాణా శాఖ ఆదేశాల మేరకేనంటూ ఫ్లెక్సీల ఏర్పాటు





నాగార్జునసాగర్‌లో చెక్‌పోస్టును ఎత్తివేస్తున్నట్లు ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ, నల్లగొండకు తరలిస్తున్న సామాగ్రి

కోదాడ రూరల్ / నాగార్జునసాగర్ / దామరచర్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ఆర్టీఏ చెక్‌పోస్టులను బుధవారం నుంచి మూసివేశారు. తెలంగాణ రాష్ట్ర సరిహద్దుల్లోని 15 చెక్‌పోస్టులను మూసివేయాలని రాష్ట్ర రవాణా శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఆ మేరకు బుధవారం సాయంత్రం ఐదు గంటలకు నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ హిల్‌కాలనీ వద్ద ఉన్న ఆర్టీఏ చెక్‌పోస్టును మూసివేసి ఇక్కడ ఉన్న కార్యాలయ సామాగ్రిని ఆటోలో నల్లగొండ ఆర్టీఏ కార్యాలయానికి తరలించారు. చెక్‌పోస్టును మూసివేస్తున్నట్లు ఓ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. ఇక నుంచి ఇతరరాష్ట్రాల నుంచి తెలంగాణకు వచ్చే ట్రాన్స్‌పోర్ట్ వాహనాల చలాన్లు ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలని ప్రకటనలో పేర్కొన్నారు. అదేవిధంగా దామరచర్ల మండలం వద్ద ఉన్న చెక్‌పోస్టును మూసివేసి ఫర్నీచర్‌ను, సామాగ్రిని జిల్లా కార్యాలయానికి తరలించారు. ప్రస్తుతం రవాణాలావాదేవీలను పూర్తిస్థాయిలో ఆన్‌లైన్ ద్వారా నిర్వహిస్తున్న నేపథ్యంలో చెక్‌పోస్టును మూసివేస్తున్నట్లు అసిస్టెంట్ ఎంవీఐ సతీష్ తెలిపారు. సూర్యాపేట జిల్లా కోదాడ మండలం నల్లబండగూడెం వద్ద అంతర్రాష్ట్ర ఆర్టీఏ చెక్‌పోస్టునూ మూసివేశారు. ఇక్కడి సామాగ్రిని, రికార్డులు, ఫర్నీచర్, కంప్యూటర్లను నల్లగొండ ఆర్టీఏ కార్యాలయానికి తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా తెలంగాణరాష్ట్రం ఏర్పాటైన ఏడాదిన్నర తర్వాత అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులను అప్పటి ప్రభుత్వం ఏర్పాటుచేసింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతో పాటు ఇతరరాష్ట్రాలకు చెందిన వాహనాలు తెలంగాణలోకి రావాలంటే ట్యాక్స్ చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఇక్కడ చెల్లించే ట్యాక్స్‌లను ప్రభుత్వం ఆన్‌లైన్‌లోనూ చెల్లించే విధానం తీసుకువచ్చింది. దీంతో చెక్‌పోస్టులను ఎత్తివేత తప్పలేదని అధికారులు తెలిపారు.

## విడి సిమెంట్ విక్రయిస్తున్న వ్యాపారిపై కేసు

చిట్యాల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ట్యాంకర్ల నుంచి సిమెంట్ కొనుగోలు చేసి అధిక ధరకు విక్రయిస్తున్న వ్యాపారిపై కేసు నమోదు చేసినట్లు నల్లగొండ జిల్లా చిట్యాల ఎస్‌ఐ మామిడి రవికుమార్ తెలిపారు. ఆయన తెలిపిన ప్రకారం చిట్యాల భువనగిరి రోడ్డులో విడి(బస్తాల్లో కాకుండా) సిమెంట్ వ్యాపారం చేస్తున్నారన్న సమాచారం మేరకు మంగళవారం రాత్రి ఎస్‌ఐ తన సిబ్బందితో అక్కడికి వెళ్లి పరిశీలించారు. సిమెంట్ బ్రిక్స్ వ్యాపారి గుండాల శ్రీనును అదుపులోకి తీసుకుని విచారించారు. అక్కడే షెడ్‌లో ఉన్న 83బస్తాల లూజ్ సిమెంట్ బ్యాగులను శ్రీను నిల్వ చేసినట్టు గుర్తించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

## డ్రంకెన్ డ్రైవ్ కేసులో పలువురికి జైలు శిక్ష, జరిమానా

సూర్యాపేట క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ పట్టుబడిన పలువురికి కోర్టులో జైలు శిక్ష, జరిమానా విధించినట్లు సూర్యాపేట జిల్లా కేంద్ర ట్రాఫిక్ ఎస్‌ఐ సాయిరాం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21న సూర్యాపేటలోని పలు ప్రాంతాల్లో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టగా మోతాదుకు మించి మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఐదుగురు పట్టుబడినట్లు తెలిపారు. వారిని బుధవారం సూర్యాపేట ద్వితీయ శ్రేణి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి పీవీ రమణ ఒకరికి రెండు రోజుల జైలుశిక్ష, రూ.2 వేల జరిమానా విధించారు. అదేవిధంగా మిగిలిన నలుగురికి కలిపి రూ.4 వేల జరిమానా విధించారని తెలిపారు. మద్యం మత్తులో వాహనాలు నడపవద్దని, ప్రమాదాలకు దారితీస్తాయన్నారు.

## బాలాజీనాయక్ ఏజెంట్లలో మొదలైన అలజడి

● ప్రత్యక్షచర్యలకు దిగుతున్న బాధితులు

● బాలాజీనాయక్ కంటే మధునాయక్‌పైనే ఫిర్యాదులు ఎక్కువ

పెద్దఅడిశర్లపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అధికవడ్డీకి ఆశపడి కోట్ల రూపాయలను కొల్లగొట్టిన నల్లగొండ జిల్లా పీఏపల్లి మండలానికి చెందిన రమావత్ బాలాజీనాయక్, మధునాయక్ ఉదంతంలో ఏజెంట్లలో అలజడి మొదలైంది. వడ్డీ విషయం బయటకు చెప్పవద్దని, చెబితే డబ్బులు రావని ద్వితీయశ్రేణి ఏజెంట్లు బాధితులను బెదిరించేవారు. దీంతో బాధితులు వెనుకడుగు వేశారు.ఇటీవల బాలాజీనాయక్‌తో పాటు మధునాయక్‌ను పోలీసులు రిమాండ్‌కు తరలించడంతో బాధితులు ఒక్కొక్కరూ గుడిపల్లి పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించగా మరికొందరు ప్రత్యక్ష చర్యలకు దిగుతున్నారు. ఏజెంట్ల ఇళ్ల వద్దకు, ఆస్తులు ఎక్కడ ఉన్నాయో ఆరా తీసి వాటిని స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. దీంతో ఏజెంట్లలో అలజడి మొదలైంది. ఇన్నిరోజులు బాలాజీనాయక్, మధునాయక్‌ను నమ్ముకుని ఉన్న ఏజెంట్లు ఇప్పుడు మొహం చాటేస్తున్నారు. అంతేకాకుండా బాలాజీనాయక్, మధునాయక్ దగ్గర తర్ఫీదు పొందిన ఏజెంట్లు వారి కంటే అధిక వడ్డీలు ఇస్తామని జనాలను మోసం చేసినట్లు తెలుస్తోంది. అమాయక ప్రజల వద్ద డబ్బులు తీసుకున్న ఏజెంట్లను పోలీసులు అదుపులోకి తీసుకుంటే ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రజల నుంచి ఎన్ని కోట్లు తీసుకున్నారో తెలుస్తుందని బాధితులు వేడుకుంటున్నారు. బాధితులకు ప్రామిసరీ నోట్లపై అవగాహన లేకపోవడంతో ఏజెంట్లకు వరంలా మారింది. బాధితులకు ఎన్ని రూ.కోట్లు అయినా ఒక్క ప్రామిసరీ నోట్‌పైనే రాసి ఇచ్చారు.

వీటి ఆధారంగా న్యాయం చేయడం పోలీసులకు సవాల్ మారింది. ఇదిలా ఉండగా రోజురోజుకు గుడిపల్లి పోలీస్‌స్టేషన్‌కు నల్లగొండ జిల్లా నలుమూలల నుంచి ఏజెంట్లపై ఫిర్యాదులు అందుతున్నా ఎన్ని ఫిర్యాదులు వచ్చాయనే విషయాన్ని పోలీసులు గోప్యంగా ఉంచుతున్నారు.

# ఫిట్‌నెస్ మంత్రం.. ఆరోగ్యం పదిలం

### వ్యాయామశాలను మరింతగా అందుబాటులోకి తీసుకొస్తాం



పబ్లిక్‌క్లబ్ వ్యాయామశాలలో మరిన్ని సౌకర్యాలు కల్పిస్తాం. ఇక్కడ షటిల్‌కోర్టుకు సైతం మంచి ఆదరణ ఉంది. పబ్లిక్‌క్లబ్ సేవలు ఉపయోగించుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ఆనందంగా ఉంది. నేటి యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి.

- కొప్పుల వేణారెడ్డి, పబ్లిక్‌క్లబ్ సెక్రెటరీ

### వ్యాయామంతో ఆరోగ్యం పదిలం



జిల్లాకేంద్రంలోని పబ్లిక్‌క్లబ్ వ్యాయామశాలలో సౌకర్యాలు బాగున్నాయి. వ్యాయామంతో ఆరోగ్యం పదిలంగా ఉంటుంది. ప్రతి ఒక్కరూ అరగంటకు పైగా వ్యాయామం చేస్తే మంచిది. వ్యాయామశాలను ఉపయోగించుకుంటున్నాను.

- డాక్టర్ మురళిమోహన్, సూర్యాపేట

### ఉదయం, సాయంత్రం కసరత్తు



ఉదయం, సాయంత్రం వ్యాయామశాలలోనే ఉంటున్నాను. ప్రస్తుతం ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవు. పబ్లిక్‌క్లబ్ ఆధ్వర్యంలో నడుస్తున్న వ్యాయామశాలలో సౌకర్యాలు బాగానే ఉన్నాయి. జిమ్‌లో కావాల్సిన శిక్షణను వివరిస్తున్నారు.

- భీష్మారెడ్డి, సూర్యాపేట

**ఆరోగ్యానికి ఫిట్‌నెస్ ఎంతో ముఖ్యం. ఇది శారీరక, మానసిక ఆరోగ్యానికి ఉపయోగపడుతుంది. గతంలో ఐదు పదుల వయస్సు దాటితేనే ఆరోగ్య సమస్యలు వచ్చేవనుకునే వారు. కానీ ప్రస్తుత ఉరుకుల, పరుగుల జీవితంలో క్షణం తీరిక లేకుండా గడుపుతున్నారు. ఆరోగ్యంపై అశ్రద్ధ వహిస్తే ముప్పు వచ్చే ప్రమాదముంది. ప్రస్తుతం ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ముఖ్యం. ప్రతిరోజూ వ్యాయామం చేస్తూ ఆరోగ్యకర జీవితాన్ని ఆస్వాదించాలి.**

**- ఆంధ్రజ్యోతి, సూర్యాపేటటౌన్**

- ఉరుకుల, పరుగుల జీవితంలో ఆరోగ్యంపై అశ్రద్ధ
- ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు చెమటోడుస్తున్న వైనం
- ఐదు పదుల వయస్సులో ఉత్సాహంగా కసరత్తు
- యువతకు ఆదర్శంగా నిలుస్తున్న సూర్యాపేట వాసులు



ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు అనేకమంది ప్రతిరోజూ వ్యాయామం, జిమ్ సెంటర్లలో కసరత్తు చేస్తున్నారు. ఐదు పదులు వయస్సు దాటిన వారు జిమ్ సెంటర్‌లో కసరత్తు చేస్తూ శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకుంటున్నారు. జిమ్‌లో గంటకు పైగా వ్యాయామం చేస్తూ దేహదారుఢ్యంతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు. ఉదయం నిద్రలేచింది మొదలు గంట నుంచి గంటన్నర వరకు జిమ్‌లోనే కసరత్తు చేస్తున్నారు. సూర్యాపేట జిల్లాకేంద్రంలోని పబ్లిక్‌క్లబ్ వ్యాయామశాలలో ఐదు పదులు దాటిన సుమారు 60 మంది ఆరోగ్యం కోసం చెమటోడుస్తున్నారు. యువత జిమ్‌కు కూడా జిమ్‌లకు వచ్చేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచిస్తున్నారు.

#### పబ్లిక్ క్లబ్‌లో కసరత్తులు

సూర్యాపేట జిల్లాకేంద్రంలోని పబ్లిక్‌క్లబ్‌లో మూడు సంవత్సరాల క్రితం వ్యాయామశాలను ప్రారంభించారు. ఉదయం 5గంటల నుంచి 9గంటల వరకు, తిరిగి సాయంత్రం 5గంటల నుంచి రాత్రి 9గంటల వరకు సుమారు 60మంది 50 సంవత్సరాలకు పైబడిన వారు కసరత్తు చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు. వీరిలో 50 నుంచి 65 ఏళ్ల వయస్సు వారు ఉన్నారు. శరీరాకృతిని, బరువును తగ్గించుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు. వ్యాయామం వీరి దినచర్యలో భాగమైంది.

### వయస్సుతో సంబంధం లేకుండా వ్యాయామం



అనారోగ్య సమస్యలకు చెక్‌పెట్టేలా జిమ్ ఉపయోగపడుతుంది. పబ్లిక్‌క్లబ్‌లో వ్యాయామశాల ఏర్పాటు చేసినప్పటి నుంచీ ఇక్కడికి వస్తున్నాను. మంచి వాతావరణం ఉంది.

- వెంకట్‌రెడ్డి, సూర్యాపేట

### ధృడమైన శరీరం జిమ్‌తో సాధ్యం



జిమ్‌లో కసరత్తులతో ధృడమైన శరీరం ఏర్పడుతుంది. ప్రతిరోజు క్రమం తప్పకుండా వ్యాయామంతో శరీరం అందమైన ఆకృతిలో వస్తుంది. ఇటీవల పలు పోటీల్లో పాల్గొన్నాను. యువత జిమ్‌కు వచ్చేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి

- రామూర్తి, సూర్యాపేట

### జిమ్ సెంటర్‌ను ఉపయోగించుకోవాలి



యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి. వ్యాయామంతో డ్రగ్స్‌ను దూరం చేసుకునే అవకాశం ఉం ది. డ్రగ్స్‌తో అనారోగ్యానికి గురికావాల్సిందే. సుమారు 60మందికి శిక్షణ ఇవ్వడం ఆనందంగా ఉంది.

- ప్రసాద్, శిక్షకుడు, సూర్యాపేట.

## శివలింగాన్ని తాకిన సూర్యకిరణాలు



శివలింగంపై ప్రకాశిస్తున్న సూర్యకిరణాలు

హుజూర్‌నగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండల పరిధిలోని బూరుగడ్డ నల్లకట్ట సంతానకామేశ్వరి సమేత శంభులింగేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం శివలింగాకారాన్ని సూర్యకిరణాలు తాకాయి. ఉదయం 6గంటల సమయంలో సూర్యకిరణాలు పడగా సుమారు 10 నిమిషాలపాటు శివలింగంపై కిరణాలు ప్రకాశించాయి. కాకతీయుల కాలంలో నిర్మించిన ఈ శివాలయాన్ని 12 సంవత్సరాల క్రితం పునర్ నిర్మించారు. ఆనాటి నుంచి ప్రతి ఏటా కార్తీకమాసం 30 రోజులు సూర్యకిరణాలు శివలింగాన్ని తాకుతుండడం గమనార్హం. ఎంతో చారిత్రాత్మక మహత్యం కలిగిన బూరుగడ్డ శివాలయంలో సూర్యకిరణాలు పడుతున్న సమయంలో రుద్రాభిషేకం చేస్తున్నట్లు అర్చకులు గుంటిపల్లి రవీంద్రాచార్యులు తెలిపారు. ఎంతో ప్రాచుర్యం కలిగిన బూరుగడ్డ శివాలయంలో కార్తీకమాసంలో భక్తులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు.

## ఎంజీయూలో ప్లేస్‌మెంట్ డ్రైవ్‌కు స్పందన

నల్లగొండ టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం ప్లేస్మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఫ్రాంక్లిన్ టెక్ లిమిటెడ్ హైదరాబాద్ సంస్థ సహకారంతో బుధవారం నిర్వహించిన ప్లేస్‌మెంట్ డ్రైవ్‌కు విశేష స్పందన లభించింది. మొత్తం 220 మంది అభ్యర్థులు హాజరుకాగా 70 మందిని జాబితాలో చేర్చినట్లు ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ వై. ప్రశాంతి తెలిపారు. ఐటీ, నాన్ ఐటీ రంగాల్లో ఉద్యోగ నియామకాల కోసం జరిగిన కార్యక్రమంలో జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుంచి అభ్యర్థులు పెద్దసంఖ్యలో హాజరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్లు శేఖర్, సత్యనారాయణరెడ్డి, వెంకట్, ఫ్రాంక్లిన్ టెక్ సీఈవో ఆర్. శివకుమార్, కంపెనీ హెచ్‌ఆర్ ప్రతినిధులు వేణు, ప్రతాప్, దివ్య, పృధ్వి, శ్రీకాంత్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## నిలకడగా మూసీకి ఇన్‌ఫ్లో

కేతేపల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మూసీ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో నిలకడగా కొనసాగుతోంది. హైదరాబాద్ నగరంతో పాటు ఎగువ మూసీ పరివాహక ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో రెండు రోజులుగా సాధారణ స్థితిలో ఉంది. దీంతో ప్రాజెక్టు అధికారులు 15 రోజులకు పైగా ఎత్తి ఉంచిన ఒక్కో క్రస్టుగేటును క్రమంగా మూసి వేస్తూ నీటిమట్టాన్ని 645అడుగుల గరిష్ట స్థాయికి చేర్చుతున్నారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రానికి 1767.22 క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో బుధవారం సాయంత్రానికి స్వల్పంగా తగ్గి 1517.58 క్యూసెక్కులుగా నమోదైంది. ప్రాజెక్టు నీటిమట్టం గరిష్ట స్థాయి నుంచి తగ్గకుండా ఉంచుతున్న అధికారులు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లోను ప్రాజెక్టు 8నెంబరు క్రస్టుగేట్లను రెండు అడుగుల మేర ఎత్తి 1323.02 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.


## జాతీయ సాఫ్ట్ బేస్‌బాల్ పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చౌటుప్పల్ టౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని ట్రినిటీ విద్యాసంస్థలకు చెందిన నలుగురు విద్యార్థులు సాఫ్ట్ బేస్‌బాల్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 19వ తేదీన జగిత్యాల జిల్లా కోరుట్లలో జరిగిన రాష్ట్రస్థాయి నాలుగో సాఫ్ట్ బేస్ బాల్ సబ్ జూనియర్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు పి. నిషాంత్, కే. మనోజ్‌కుమార్, కే. వైష్ణవి, జి. అక్షర ప్రతిభను కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వచ్చే నెల 7, 8, 9వ తేదీల్లో మహారాష్ట్రలోని షిరిడీలో నిర్వహించే జాతీయ స్థాయిలో పోటీల్లో పాల్గొంటారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ట్రినిటీ విద్యాసంస్థల చైర్మన్ కృష్ణారావు, ప్రిన్సిపాల్ మంజుల తదితరులు అభినందించారు.

## జాతీయస్థాయి ఎయిర్ పిస్టల్ పోటీలకు



పవన్‌కుమార్

భూదాన్‌పోచంపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్ర రాజధాని త్రివేండ్రంలో అక్టోబరు 11 నుంచి 14 వరకు జరిగిన 16వ సౌత్‌జోన్ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ పోటీల్లో తెలంగాణ రాష్ట్ర తరుపున యాదాద్రి-భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం పెద్దరావులపల్లి గ్రామానికి చెందిన తప్పెట పవన్‌కుమార్ పోటీల్లో పాల్గొన్నాడు. ఈ పోటీల్లోని యూత్ సబ్ యూత్ విభాగంలో ఆయన జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కోచ్ సందీప్‌కుమార్ తెలిపారు. పవన్ ఎంపిక పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందించారు.

## రాష్ట్రస్థాయి జూడో పోటీలకు విద్యార్థిని



కనుకునిది చందన

గుండాల, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల నిర్వహించిన ఉమ్మడి నల్లగొండ జిల్లా స్కూల్ గేమ్స్ అండర్ -14,17 బాలబాలికల పోటీల్లో గుండాల కస్తూర్బా పాఠశాలకు చెందిన కనుకునిది చందన రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. విద్యార్థినిని పాఠశాల స్పెషల్ ఆఫీసర్ విజయలక్ష్మీ, ఉపాధ్యాయులు అభినందించారు. రాష్ట్రస్థాయి క్రీడల్లో రాణించాలని వారు ఆకాంక్షించారు.

# భక్తిశ్రద్ధలతో యాద'గిరి' ప్రదక్షిణ

- భక్తుల భజనలు, కీర్తనలు
- నరసింహ నామంతో ప్రతిధ్వనించిన దివ్యక్షేత్రం



గిరిప్రదక్షిణలో పాల్గొన్న కలెక్టర్ హనుమంతరావు, విప్ అయిలయ్య దంపతులు

యాదగిరిగుట్ట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి దివ్య క్షేత్రం నమో నారసింహ కీర్తనలతో ప్రతిధ్వనించింది. బుధవారం స్వాతి నక్షత్రం పురస్కరించుకొని ఆలయంలో వేకువజామున అష్టోత్తర శతఘటాభిషేకం, గిరిప్రదక్షిణ, కార్తీక వ్రతాలు జరిపించి దీపాలను వెలిగించారు. వైకుంఠద్వారం నుంచి సామూహిక గిరిప్రదక్షిణ వైభవంగా కొనసాగింది. ఈ వేడుకలతో ఆధ్యాత్మిక శోభ రెట్టింపైంది. ఆలయంలో వేకువజాము నుంచి రాత్రి వరకు వివిధ పూజల్లో పాల్గొనేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. స్వామివారి జన్మనక్షత్రం సందర్భంగా అష్టోత్తర శతఘటాభిషేక పూజలు అర్చకులు చేపట్టారు. గిరిప్రదక్షిణలో స్వామివారిని స్తుతిస్తూ భజనలు, కీర్తనలతో కొండచుట్టు రెండున్నర కిలోమీటర్ల మేర 45 నిమిషాల పాటు హోరెత్తించారు. గిరిప్రదక్షిణ పూర్తి చేసిన భక్తులు మెట్ల దారిలో కొండెక్కే భక్తులకు 1,500 ఉచిత దర్శన టికెట్లు మాత్రమే అధికారులు పంపిణీ చేసి, ప్రత్యేక దర్శన క్యూలైన్ ద్వారా ఆలయంలోకి అనుమతించారు. అధిక సంఖ్యలో వాహనాలపై తరలి రావడంతో వైకుంఠద్వారం (కూడలి) రోడ్లు నిండిపోగా వాహనాల పార్కింగ్‌తో ప్రదక్షిణ భక్తుల రాకపోకలకు అంతరాయం కలిగింది. ప్రదక్షిణ మధ్యాహ్నం ఆరగింపు సమయం (12గంటలకు) వరకు సుమారు 25వేల మంది భక్తులు ప్రదక్షిణ పూర్తి చేసుకున్నారు. ఉభయ క్యూలైన్‌లో భక్తులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తుల రద్దీ కొనసాగగా బ్రేక్ దర్శనాలు, మధ్యాహ్నం ఆరగింపు సమయం కలిపి మూడు గంటల పాటు వేచి ఉన్నారు. కొండకింద కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించి కొంతమంది భక్తులు కొండపైన విష్ణు పుష్కరిణి, లక్ష్మీపుష్కరిణిలో పుణ్య స్నానాలు, సత్యదేవుని వ్రతాలు ఆచరించి మొక్కులు తీర్చుకోగా, దర్శనానంతరం అన్నప్రసాదం స్వీకరించారు.



గిరిప్రదక్షిణ సమయంలో నడుస్తున్న వాహనాలు

#### వేదాశీర్వచనం

ఆలయంలోకి ప్రవేశించిన ప్రభుత్వ విప్ అయిలయ్య దంపతులు, కలెక్టర్ హనుమంతరావు కు ఆలయ మర్యాదలతో ప్రధానార్చకుడు భట్టర్ సురేంద్రాచార్యులు బృందం స్వాగతం పలికారు. గర్భాలయంలోని స్వయంభువులను దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వేద మండపంలో పండితులు వేదాశీర్వచనం చేశారు. కాగా, ప్రతి నెల స్వాతి నక్షత్రం రోజున వైకుంఠద్వారం చెంత శ్రీ వెంకట అన్నమాచార్య సేవ ట్రస్టు కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. యాదగిరిగుట్ట ఏసీపీ పి. శ్రీనివాస్‌నాయుడు పర్యవేక్షణలో పట్టణ ఇన్‌స్పెక్టర్ బొడ్డుపల్లి భాస్కర్ సారథ్యంలో భక్తుల రద్దీని అదుపు చేసేందుకు పోలీసులు బారికేడ్లతో బందోబస్తు నిర్వహించారు.

#### అష్టోత్తర శతఘటాభిషేక పూజలు

ఆలయంలో స్వామివారి స్వాతి జన్మ నక్షత్రం పురస్కరించుకొని వేకువజామున అష్టోత్తర శతఘటాభిషేకం పూజారులు వైభవంగా నిర్వహించారు. సుప్రభాత సేవతో స్వామిఅమ్మవారిని మేల్కొలిపి నిత్యారాధనలు జరిపిన అర్చకులు ఆస్థాన పరంగా ఆరాధనలు జరిపి ఉత్సవమూర్తులకు హారతి నివేదించారు. ముఖమండపంలో 108 కలశాలు ఏర్పరచి వాటిపై కొబ్బరికాయలు పేర్చి అందులో పంచామృతాలు నింపి పంచసూక్త పఠనాలతో హవనం చేపట్టారు. ఉత్సవమూర్తులను, అలంకార మూర్తులను అభిషేకించారు. తులసీ దళాలతో సహస్రనామార్చనలు నిర్వహించారు. పండితుల వేద మంత్రాలు, ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాల నడుమ అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించి 108 సువర్ణ పుష్పాలతో అర్చించారు. సాయంత్రం స్వామివారి జన్మనక్షత్రం సందర్భంగా దివ్యమనోహరంగా అ లంకరించి ప్రత్యేక పూజలు చేశారు. కాగా యాద గిరిక్షేత్రంలో హరిహరులకు నిత్యపూజలు శాస్త్రో క్తంగా కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ వి భాగాల ద్వారా రూ.20,79,254 ఆదాయం సమకూరినట్లు ఇన్‌చార్జి ఈవో గుగులోతు రవి తెలిపారు.



అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

#### కార్తీక దీపారాధన

కాగా, వ్రత మండపాలు, పరిసర ప్రాంతాలను ఆలయ అధికారులు పరిశీలిస్తూ సిబ్బందికి తగిన సూచనలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్తీక మాసం సందర్భంగా ఇష్టదైవాలను దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో కార్తీక దీపాలు వెలిగించారు. కొండపైన ఆలయం ఉత్తర రాజగోపురం ఎదుట, శివాలయం, విష్ణుపుష్కరిణీ, కొండకింద లక్ష్మీపుష్కరిణి, వ్రత మండపం, వైకుంఠద్వారంతో కలిపి ఐదు ప్రదేశాల్లో టెండరుదారులు తగిన ఏర్పాటు చేయగా భక్తులు కార్తీక దీపాలను వెలిగించి భక్తిని చాటుకున్నారు.

#### ఆరు విడతల్లో 175 వ్రతాలు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయంలో బుధవారం భక్తులు అధిక సంఖ్యలో సత్యదేవుని కార్తీక వ్రతాలు నిర్వహించారు. కార్తీక మాసం ప్రవేశంతో రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులతో కొండకింద వ్రత మండపాలు నిండిపోగా కొండపైన ఇష్టదైవాలను దర్శించుకుని ఆర్జిత సేవల్లో పాల్గొన్నారు. తొలిరోజు ఆరు విడతల్లో జరిగిన వ్రతాల్లో 175 జంటలు సత్యదేవుని వ్రతాలు ఆచరించి మొక్కులు తీర్చుకున్నాయి. మొదటి విడత 36, రెండో విడత 67, మూడో విడత 33, నాలుగో విడత 23, ఐదో విడత 08, ఆరో విడత 08 వ్రతాలు జరిగినట్లు ఏఈవో జాటోతు శంకర్‌నాయక్ తెలిపారు. రూ.1,000 టికెట్టు పొందిన దంపతులకు వ్రత పూజ సామగ్రి, అవసరమయ్యే పాత్రలు అధికారులు అందజేశారు. కాగా, భక్తుల సౌకర్యార్థం కియోస్కో యంత్రాలు, మొబైల్ ఏటీఎం అధికారులు ఏర్పాటు చేశారు.



వ్రత పూజల్లో పాల్గొన్న భక్తులు

# రోడ్డు దాటాలంటే ప్రయాసే..



రోడ్డుకు ఇరువైపులా నిలిపి ఉంచిన వాహనాలు

మిర్యాలగూడ టౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని రెడ్డీకాలనీలో ఆస్పత్రులు, విద్యాలయాలతో పాటు వ్యాపార సంస్థలు చాలా ఉన్నాయి. వాటిని నిర్వహించే యజమానులు కనీస నిబంధనలు పాటించడం లేదు. రహదారులను ఆక్రమిస్తూ వ్యాపారం కొనసాగిస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలోని ఎస్‌బీఐ కాంప్లెక్స్ వెనుక భాగంలో రహదారిపై నిర్వహిస్తున్న టిఫిన్ సెంటర్లతో వాహన దారులు పాట్లు పడుతున్నారు. రోడ్డుకిరువైపులా వాహనాలు నిలిపివేయడంతో పాటు రోడ్డు మధ్యలో నిలబడి తినడం, డిస్పోజల్ ప్లేట్లు, గ్లాసులు ఎక్కడ పడితే అక్కడ వేయడంతో అసౌకర్యం కలుగుతోందని స్థానికులు వాపోతున్నారు.

#### ఇబ్బంది పడుతున్న రోగులు

ఇరుకైన సందులతో కనీసం అంబులెన్స్ కూడా దూరలేని పరిస్థితి ఉన్న డాక్టర్స్ కాలనీలో ఆస్పత్రుల నిర్వహణ కష్టంగా మారింది. ఈ నేపథ్యంలో సమీపంలోని రెడ్డీకాలనీలో ఆస్పత్రులను ఏర్పాటు చేస్తున్నారు. ఇటీవల నాలుగైదు ప్రధాన ఆస్పత్రులు రెడ్డీకాలనీలో ప్రారంభించారు. రహదారులన్నీ ఇడ్లీబండ్లు, కర్రీ పాయింట్లతో నిండిపోవడంతో ఆయా ఆస్పత్రులకు రాలేక రోగులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించాలని స్థానికులు కోరతున్నారు.

#### ప్రజలకు అసౌకర్యం కలిగించొద్దు



రహదారులను ఆక్రమించుకుని వ్యాపారం చేయడం చట్టవిరుద్ధం. చిరువ్యాపారులైనా, పెద్ద వ్యాపారులైనా నిబంధనలు పాటిం చాలి. పట్టణ ప్రజలకు, వాహనదా రులకు అసౌకర్యం కలిగిస్తే అవసరమైన చర్యలు తీసుకుంటాం. ఆహార పదార్థాలను విక్రయించే వారు శుచి, శుభ్రత పాటించాలి, జాగ్రత్తలు పాటించకపోతే ప్రజారోగ్యంపై ప్రభావం పడుతుంది.

● శ్రీనివాస్, మునిసిపల్ కమిషనర్, మిర్యాలగూడ.

## రోడ్డుపైకి చెట్ల కొమ్మలు.. వెళ్లేందుకు వాహనదారులు తంటాలు



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వెళ్లే మార్గంలో రోడ్డుపైకి వస్తున్న కొమ్మలు

నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని ఎన్నెస్పీ క్యాంపులో పెరిగిన పచ్చదనం ప్రజలకు కొంత అసౌకర్యం కలిగిస్తోంది. టూటౌన్ పోలీస్ స్టేషన్ నుంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం మీదుగా మునిసిపల్ కార్యాలయానికి వెళ్లే మార్గంలో పచ్చదనంతో అభివృద్ధి చేశారు. ఇరువైపులా పెరిగిన మొక్కలు, చెట్ల కొమ్మలు రోడ్డు మీదకు విస్తరించడంతో వాహనదారులు అసౌకర్యానికి గురవుతున్నారు. పచ్చదనాన్ని పెంచి పోషించడం అవసరమే అయినప్పటికీ, మొక్కలకు ప్రూనింగ్ చేయించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

● (ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ టౌన్)

## నాణ్యత పాటించాలి



మోత్కూరు అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉన్న ధాన్యం కొనుగోలు చేయాలని వ్యవసాయ అధికారి వెంకటరమణారెడ్డి అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మార్కెట్ నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఆటోమెటిక్ ప్యాడి క్లినర్ ద్వారా నిర్వహిస్తున్న ధాన్యం శుభ్ర పరిచే ప్రక్రియను గమనించారు. వరి తేమ శాతం, నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం వచ్చిన ధాన్యాన్ని తూకం వేయాలని సీఈవోకు సూచించారు. తేమ శాతం తగ్గే విధంగా, నాణ్యమైన ధాన్యం మార్కెట్‌కు వచ్చేలా జాగ్రత్తలు తీసుకోవాలని రైతులను కోరారు. రైతులు ఇబ్బంది పడకుండా, ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సాంకేతిక వ్యవసాయ అధికారి శ్రీనివాసులు, నాణ్యత పరిశీలన అధికారి గోపినాథ్, ఏఈవో సింహప్రసాద్, సీఈవో వరలక్ష్మీ, సెంటర్ ఇన్‌చార్జి సంధ్య, నాగేష్ పాల్గొన్నారు.

### కపాస్ కిసాన్ యాప్‌పై రైతులకు అవగాహన

మర్రిగూడ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కపాస్ కిసాన్ యాప్‌పై వ్యవసాయ అధికారి సహస్ర మండలంలోని కొట్టాల గ్రామంలో రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. సీసీఐకి పత్తి విక్రయించే రైతులు ఖచ్చితంగా కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకొని వెళ్లాలని సూచించారు. మండలంలో రెండు సీసీ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. యాప్‌కు సంబంధించి ఏమైనా సందేహాలు ఉంటే సమీప వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలని సూచించారు.

### జీటీఏ పట్టణ అధ్యక్షుడిగా మునినాయక్




నల్లగొండ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉపాధ్యాయుల సంఘం(జీటీఏ) పట్టణ అధ్యక్షుడిగా మేరావత్ మునినాయక్, ప్రధాన కార్యదర్శి మాంద్ర శివప్రసాద్ నియమితులయ్యారు. సంఘం జిల్లా అధ్యక్షుడు సంపత్‌కుమార్ బుధవారం వారికి నియామక పత్రాలు అందజేశారు. తమ నియామకానికి కృషిచేసిన అధ్యక్ష, కార్యదర్శులకు, జిల్లా అసోసియేట్ అధ్యక్షులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

## మంత్రిపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

శాలిగౌరారం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మంత్రి అడ్లూరి లక్ష్మణ్, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ అనుచిత వ్యాఖ్యలు సరికాదని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల నాయకులు అన్నారు. శాలిగౌరారంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో ఆంధ్ర వ్యాపారుల వద్ద డబ్బులు వసూలు కిషోర్‌కుమార్‌కు మంత్రి, ఎంపీపై మాట్లాడే అర్హతలేదన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రజలకు అభివృద్ధి సంక్షేమ పథకాలు అందిస్తుంటే చూసి ఓర్వలేక ఇష్టానుసారంగా మాట్లాడితే ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకుడు చింత ధనంజయ, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు బోడ అరుణ్‌కుమార్, నాయకులు గూని వెంకటయ్య, పెరుమాండ్ల నరేష్, వేముల గోపినాథ్, తోటకూరి పరుశరాములు, వేముల భరత్, కోక సాయి, గుండ్లపల్లి సైదులు, ఇంద్రకంటి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణానీటి కోసం పైప్‌లైన్ పనుల పరిశీలన

చండూరురూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటయ్యగూడెం, ఉడుతలపల్లి గ్రామాల్లోని మాదన్నచెరువు, ఊర చెరువులకు కృష్ణానీటిని లిఫ్ట్ చేసి నింపేందుకు పైప్‌లైన్ పనులను బుధవారం ఇరిగేషన్ ఏఈ రఘు పరిశీలించారు. పడమటితాళ్ళ, కోటయ్యగూడెం, ఉడుతలపల్లి, దుబ్బగూడెం ఊర చెరువులకు పైప్‌లైన్ ఏర్పాటు చేసి చెరువులు నింపాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి ఆయా గ్రామాల ప్రజలు వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే ఆ చెరువులకు దగ్గర్లో ఉన్న కనగల్ మండలం కురంపల్లి ఎస్ఎల్‌బీసీ కాల్వ నుంచి పైప్‌లైన్ ఏర్పాటు చేసి ఎత్తిపోసే విధంగా ఏర్పాటు చేసేందుకు ఇరిగేషన్ ఏఈ గ్రామస్థులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొరిమి ఓంకారం, నాయకులు కావలి అంజనేయులు ముదిరాజ్, మాజీ సర్పంచులు మేకల వెంకన్న పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

మర్రిగూడ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సీపీఎం నాయకులు కోరారు. తహసీల్దార్ శ్రీనివాసులు బుధవారం వినతి పత్రం అందజేశారు. పత్తికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో కమీషన్‌దారులు రూ.5వేల నుంచి రూ.6వేల వరకే కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. సీసీఐ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. అదే విధంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందుల లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఏర్పుల యాదయ్య, సల్వాజు రామలింగాచారి, ఏరుకొండ రాఘవేంద్ర, ఐతపాక యాదయ్య, మేతరి నరసింహ, ఇరగదిండ్ల రాజు, అయితపాక లచ్చయ్య, అయితపాక జంగయ్య, పేగోజు ఈశ్వరాచారి, నూకల రాములు తదితరులు పాల్గొన్నారు.

## పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించొద్దు

నార్కట్‌పల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకున్నా, సరుకుల రవాణా చేసినా కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ దగ్గుల క్రాంతికుమార్ హెచ్చరించారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదేశాల మేరకు బుధవారం సాయంత్రం నార్కట్‌పల్లిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పరిమితికి మించి సరుకులు రవాణా చేస్తున్న డీసీఎంపై కేసు నమోదు చేశారు. పరిమితికి మించి సరుకు రవాణా చేయడంతో పాటు లోడ్ టాప్‌పై ప్రమాదకర రీతిలో ప్రయాణికులను ఎక్కించినందుకు గాను కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## వేణుగోపాలస్వామి ఆలయంలో ఆకాశదీపం

నార్కట్‌పల్లి, అక్టోబరు 22,(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ప్రారంభాన్ని పురస్కరించుకుని బుధవారం సాయంత్రం నార్కట్‌పల్లిలోని వారిజాల వేణుగోపాల స్వామి ఆలయంలో ఆకాశదీపాన్ని ఆవిష్కరించారు. అర్చకుడు కారంపూడి వేణాచార్యులచే ఆలయంలో ఉన్న ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలనంతరం ఆకాశదీపాన్ని వేలాడదీయగా హాజరైన భక్తులు ఆకాశదీపానికి నమస్కరించారు. ఈ వేడుకలో ఆలయ ఛైర్మన్ దోసపాటి ప్రసాద్, మాజీ ఛైర్మన్ పసునూరి పాండురంగయ్య, ఐతరాజు రమేశ్, దుబ్బాక శ్రీధర్, కొప్పు నర్సింహ, దోసపాటి రఘు, బెల్లి దశరథ, దోసపాటి విశాలాక్షి, పాశం భారతమ్మ, గర్రె కళమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి రావాలని బోనం


బోనం సమర్పిస్తున్న కాంగ్రెస్ నాయకుడు ఆరెళ్ల సైదులు

మునుగోడు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి రావాలని ఓ కాంగ్రెస్ నాయకుడు ముత్యాలమ్మకు బోనం సమర్పించాడు. బుధవారం మునుగోడులో ఈ సంఘటన జరిగింది. మునుగోడు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆరెళ్ల సైదులుముదిరాజ్ కుటుంబ సభ్యులు ప్రత్యేక బోనం తయారు చేయించారు. బుధవారం తెల్లవారుజామున చేసి బోనం తీశారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనం సమర్పించి యాట(మేక)ను బలి ఇచ్చారు. తమ అభిమాన నాయకుడు రాజగోపాలోరెడ్డికి మంత్రి పదవి ఇచ్చి హామీ నెరవేర్చాలని కాంగ్రెస్ అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశారు. మంత్రి పదవి వస్తే తమ నియోజకవర్గం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందనుందని చెప్పారు.

### తూకాల్లో
## మోసాలకు అడ్డుకట్ట పడేనా?

(5వ పేజీ తరువాయి)

నుంచి అధికారులకు ఫిర్యాదులు అందుతున్నాయి. ఆసియా ఖండంలోనే అత్యధికంగా రైస్‌మిల్లులు ఉన్న మిర్యాలగూడ ప్రాంతంలో ఏడాదిలో రెండు పంటల కాలంలో లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లర్లు కొనుగోలు చేస్తున్నారు. ట్రాక్టర్ ట్రాలీలో తెచ్చిన ధాన్యం మచ్చు చూసి ధర నిర్ణయించి వెంటనే అదే రైస్‌మిల్లుకు చెందిన వేబ్రిడ్జిపై కాంటా వేసి అన్‌లోడ్ చేయిస్తున్నారు. ధర నిర్ణయ సమయంలోనే కొంత ధర తగ్గించే మిల్లర్లు తూకంలో మోసాలకు గురిచేస్తున్నారని చాలాకాలంగా రైతులు మొరపెట్టుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. గత ఏడాది ఓ మిల్లులోని వేబ్రిడ్జి నిర్వాహకులు తూకంలో మోసానికి పాల్పడుతున్నట్లు ఆరోపించడంతో జిల్లా అధికారులు తనిఖీలు నిర్వహించగా, ట్రాలీకి 40కిలోల వరకు తక్కువ తూకం వచ్చిందని తేల్చారు. వేబ్రిడ్జిని సీజ్ చేసి, రూ.1,25,000 జరిమానా విధించారు. అప్పటికే ఆ మిల్లు యజమాని భారీగా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేశాడు.

### గత ఏడాది 381 కేసులు

జిల్లాలో 2024-25లో వివిధ విభాగాల్లో తూకాల్లో తేడాలు జరుగుతున్న విషయమై తూనికల కొలతల అధికారులు 381 కేసులు నమోదు చేసి రూ.42.66లక్షలు జరిమానా విధించారు. తూనికల అధికారుల హెచ్చరికలను ఖాతరు చేయకుండా వేబ్రిడ్జీల నిర్వాహకులు మోసాలకు పాల్పడుతున్నారని, అలాంటి వారిపై మరింత కఠినంగా చట్టాలను ప్రయోగించాలని రైతులు కోరుతున్నారు. అత్యధికంగా మిల్లులు ఉన్న మిర్యాలగూడలో ప్రత్యేకంగా తూనికల, కొలతల కార్యాలయం ఏర్పాటు చేయకుండా కాంటాల నిర్వాహకులపై అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. తూకంలో తేడాలు గుర్తించి ప్రజలు ఫిర్యాదు చేస్తే తప్ప ముందస్తు తనిఖీలు చేపట్టడంలేదని పేర్కొంటున్నారు.

### తూకంలో తేడాలు వస్తే ఫిర్యాదు చేయాలి

ఏడాదికి ఒకసారి వేబ్రిడ్జిలను చెక్‌చేసి స్టాంపింగ్ చేస్తాం. ఇప్పటివరకు జిల్లా 200 వరకు స్టాంపింగ్ చేశాం. తూకంలో తేడాలు ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే ఫిర్యాదు చేయాలి. తక్షణమే చర్యలు తీసుకుంటాం. తేడాలున్నట్లు తేలితే సదరు కాంటాల నిర్వాహకులపై చర్యలు తీసుకుంటాం. జరిమానా విధించడంతో పాటు వేబ్రిడ్జిని సీజ్ చేస్తాం. తూనికలు కొలతల్లో మోసాలు జరిగితే సహించేదిలేదు. కఠిన చర్యలు తీసుకుంటాం.

● శ్రీనివాస్, జిల్లా తూనికల కొలతల అధికారి

# మూలకు పడి సంవత్సరం

**జడ్పీ ఉన్నత పాఠశాలలో మరమ్మతులకు నోచని వాటర్ ఫిల్టర్ ● తాగునీరు అందించాలని విద్యార్థుల వేడుకోలు**


నిరుపయోగంగా ఉన్న వాటర్ ఫిల్టర్

నాంపల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు తాగునీరు అందించే వాటర్ ఫిల్టర్ మరమ్మతులకు గురైంది. సంవత్సరం నుంచి విద్యార్థులకు తాగునీరు అందడం లేదు. పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు మొత్తం 500మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఫ్లోరిన్ నీటి బారి నుంచి విద్యార్థులకు రక్షిత మంచినీరు అందించాలనే ఉద్దేశంతో కొండమల్లేపల్లికి చెందిన సంజీవని ట్రస్ట్ ఆధ్వర్యంలో 10సంవత్సరాల క్రితం నాంపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో లక్షల రూపాయల వెచ్చించి వాటర్ ఫిల్టర్ ఏర్పాటు చేశారు. వాటర్ ఫిల్టర్ మంచినీటిని విద్యా ర్థులకు ఉపయోగంలోకి వచ్చిన గత సంవత్సరం నుంచి మరమ్మ తులకు గురైంది. దీంతో విద్యార్థులు ఫ్లోరిన్ నీటిని తాగే పరిస్థితి ఏర్పడి ంది. వాటర్ ఫిల్టర్‌కు మరమ్మతులు చేయించి తాగునీరు అందించాలని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. వాటర్ ఫిల్టర్‌కు త్వరలో మరమ్మతులు చేయించి విద్యార్థులకు అందుబాటులోకి తెస్తామని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తెలిపారు.

# 'దళితబంధు' నిధులు విడుదలచేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న కేవీపీఎస్ నాయకుడు పాలడుగు నాగార్జున

నల్లగొండ టౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): దళిత బంధు పథకం నిధులు వెంటనే విడుదల చేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలో బుధవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గంలో మంజూరైన 1300 మంది దళిత లబ్ధిదారులకు దళితబంధు నిధులు ఇప్పటికీ విడుదల కాలేదన్నారు. గత ఎన్నికల ముందు స్థానిక లక్ష్మీ గార్డెన్స్‌లో సభ నిర్వహించి కలెక్టర్ చేతుల మీదుగా ప్రొసీడింగ్స్ అందచేసి పతి లబ్ధిదారునికీ రూ.10లక్షల చొప్పున మొత్తం రూ.130 కోట్లు నల్లగొండ జిల్లా కలెక్టర్ అకౌంట్లో రెండు సంవత్సరాల క్రితమే జమ చేశారని గుర్తుచేశారు. ఆ నిధులు ఇప్పటి వరకు లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ కాకపోవడం విచారకరమన్నారు. రాష్ట్రంలోని ఇతర నియోజకవర్గాల్లో రెండో విడత దళిత బంధు నిధులు లబ్ధిదారులకు అందజేసినప్పటికీ నల్లగొండ నియోజకవర్గంలో మాత్రం ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి లబ్ధిదారుల నిధులు విడుదల చేయాలన్నారు. లేనిపక్షంలో 1300 మంది లబ్ధిదారులు ఉద్యమానికి దిగుతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో దళిత బంధు సాధన కమిటీ నాయకులు, కేవీపీఎస్ పట్టణ కార్యదర్శి గాదె నరసింహ, పోలే సత్యనారాయణ, కత్తుల యాదయ్య, గోలి నవీన్, తీగల ఎల్లేష్, తక్కెళ్ళ నాగరాజు, మునుకు వెంకటయ్య, మల్లేపల్లి రాంబాబు, సూర్యపెల్లి మనోహర్, కొండేటి నాగయ్య, కుడతాల రాజు, పోలే రాములు, కందుల ప్రవీణ్, ఒలికి వెంకటేశం, నిరసన వెంకన్న, పెరిక రవి, కత్తుల రవి, హరి తదితరులు పాల్గొన్నారు.

# పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

కేతేపల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పశువులకు గాలికుంటు, గర్భకోశ వ్యాధుల నివారణ టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి నవజీవన్ అన్నారు. రైతులు తమ పాడి, వ్యవసాయ పశువులకు ప్రస్తుత సీజన్‌లో గాలికుంటు, గర్భకోశ వ్యాధుల నివారణ టీకాలు వేయించాలని సూచించారు. ప్రస్తుత వానాకాల సీజన్‌లో పశువుల్లో గాలికుంటు వ్యాధి ప్రబలే వీలుందన్నారు. అలాగే పాడి పశువులకు గర్భకోశ వ్యాధులు సైతం సోకే ప్రమాదముందని తెలిపారు. పాడి పశువులు వ్యాధిబారిన పడితే పాల దిగుబడి తగ్గిపోతుందన్నారు. పశువులు వ్యాధులబారిన పడకముందే ముందు జాగ్రత్త చర్యగా వ్యాధి నివారణ చర్యలు తీసుకోవడం ప్రయోజనకరమన్నారు. ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన టీకాలు వేయించి పశు సంపదను వ్యాధులబారి నుంచి కాపాడుకోవాలని రైతులను కోరారు. ఆయా వ్యాధుల నివారణ కోసం నాలుగు నెలలు నిండిన దూడల నుంచి అన్ని రకాల పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నామని చెప్పారు. కేతేపల్లితో పాటు భీమారం, ఉప్పలపహాడ్, తుంగతుర్తి గ్రామాల్లోని 1500 పశువులకు గాలికుంటు, గర్భకోశ వ్యాధుల నివారణ టీకాలు వేశామన్నారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో పర్యటించి రైతుల అన్నిరకాల పశువులకు వ్యాధి నివారణ టీకాలు వేస్తామని చెప్పారు. గ్రామాల్లోకి వచ్చిన తమ సిబ్బందికి సహకరించాలని ఆయన రైతులను కోరారు.

# రైతులు మద్దతు ధర పొందాలి


పిట్టంపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్

చిట్యాలరూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని వెలిమినేడు పీఏసీఎస్ ఛైర్మన్ ఏనుగు రఘుమారెడ్డి కోరారు. మండలంలోని పిట్టంపల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. రైతులు కష్టపడి పండించిన సన్నరకం ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించే రైతులకు క్వింటాలుకు రూ.500ల బోనస్‌ను అందిస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. కార్యక్రమంలో వైస్‌ఛైర్మన్ బొంతల అంజిరెడ్డి, మాజీ మార్కెట్ ఛైర్మన్ కాటం వెంకటేశం, పిశాటి భీష్మారెడ్డి, ఏదుళ్ల అజిత్‌రెడ్డి, మామిడి శ్రీరాములు, టేకుల కవితాఅంజిరెడ్డి, కోనేటి యాదగిరి, గుడిపాటి లక్ష్మీనర్సింహ, అద్దెల లింగారెడ్డి, సామిడి మోహన్‌రెడ్డి, ఏట పగిడిమర్రి గిరిబాబు, నారగోని దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

కేతేపల్లి: గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్ళు వేగవంతం చేయాలని జిల్లా సహకార అధికారి పత్యానాయక్ అన్నారు. బుధవారం నకిరేకల్ మార్కెట్ ఛైర్‌పర్సన్ గుత్తా మంజుల, కేతేపల్లి పీఏసీఎస్ ఛైర్మన్ బోళ్ళ వెంకటరెడ్డిలతో కలిసి మండలంలోని తుంగతుర్తి గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్య కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. వర్షాలు కురుస్తున్నందున కేంద్రాల్లో ధాన్యం నిల్వలు అధికంగా ఉండకుండా చూసుకోవాలన్నారు. తడిసిన ధాన్యం ఎప్పటికప్పుడు ఆరబెట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ వెంకన్న, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కె.శ్రీనివాసయాదవ్, మాజీ ఎంపీపీ పి.శేఖర్, కాంగ్రెస్ నాయకులు ఎం.వెంకట్రాంరెడ్డి, జె. వెంకటరెడ్డి పాల్గొన్నారు.

కనగల్: ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని ఏపీవో మైసేశ్వర్‌రావ్ సూచించారు. బోయినపల్లి గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. వరి ఏగ్రేడ్ రకానికి క్వింటాకు ధర రూ.2,389, సాధారణ రకానికి రూ.2,369 చెల్లించనున్నట్లు తెలిపారు. సన్నరకం ధాన్యం క్వింటాకు రూ.500 చొప్పున బోనస్‌ను అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సీసీ ఇద్దయ్య, గానూతుల రాంరెడ్డి, నూనె సైదులు, బిచ్చాల శ్రీను, పగిడి సైదులు తదితరులు పాల్గొన్నారు.

శాలిగౌరారం: రైతుల సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ఎండిన ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని మండల వ్యవసాయాధికారి ఎస్. సౌమ్య శృతి అన్నారు. మండలంలోని తక్కెళ్లపహాడ్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో అంతటి వీరేష్, ఎఫ్‌పీవో అధ్యక్షులు నిమ్మల కృష్ణమూర్తి, మాజీ ఎంపీటీసీ తీర్పారి మల్లయ్య, రైతులు నారంరెడ్డి, చొక్కళ్ల రత్నాచారి, సంకటి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## మునిసిపాలిటీ అభివృద్ధికి కృషి


సీసీ, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వీరేశం

నకిరేకల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నకిరేకల్ మున్సిపాలిటీలో దశల వారిగా మౌళిక సదుపాయాలు పూర్తి చేసేందుకు కృషిచేస్తానని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 1, 8, 9వ వార్డుల్లో సీసీరోడ్లు, డ్రైనేజీ పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. మున్సిపాలిటీ పరిధిలో కొన్నిచోట్ల డ్రైనేజీ అస్తవ్యస్తంగా ఉందని, దశల వారిగా డ్రైనేజీ వ్యవస్థను బాగు చేస్తామన్నారు. నకిరేకల్‌లో 100 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులు పూర్తి అవుతున్నందున, త్వరలో ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ చెవుగోని రజిత శ్రీను, ఏఈ గౌ తమ్, కౌన్సిలర్లు పన్నాల పావని శ్రీనివాస్‌రెడ్డి, చెవుగోని అఖిల, కందాళ భిక్షంరెడ్డి, గాజుల సుకన్య శ్రీనివాస్, సునిల్ ఉన్నారు.

## 26న స్క్రీనింగ్ క్యాంప్

శాలిగౌరారం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కృత్రిమ కాళ్ల పంపిణీ కోసం లయన్ ఇంటర్నేషనల్, తెలంగాణ అమెరికా తెలుగు సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 26న హయత్‌నగర్‌లో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు స్క్రీనింగ్ శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ జోన్ ఛైర్మన్ బుడిగె శ్రీనివాసులు తెలిపారు. శాలిగౌరారంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి మాత్రమే ఉచిత కృత్రిమ కాళ్లు పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. వివరాలకు ప్రోగ్రాం డిస్ట్రిక్ కోఆర్డినేటర్ లయన్ బచ్చుపల్లి రవీందర్‌రావు సెల్: 9848344767, గ్రేటర్ క్లబ్ అధ్యక్షుడు పూస లింగయ్య సెల్: 9848299554, ప్రోగ్రాం జాయింట్ కోఆర్డినేటర్ నూల పరమేష్ సెల్: 9866549227 నెంబర్లకు ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

## మంజులా రాణికి ఎంపీ నివాళి

నార్కట్‌పల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మృతిచెందిన కోమటిరెడ్డి మంజులారాణికి భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి నివాళులర్పించారు. మండలంలోని బీ.వెల్లెంలకు చెందిన లోటస్ ల్యాప్ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు, తెలంగాణ రాష్ట్ర గ్రీన్ అంబాసిడర్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి సతీమణి మంజులారాణి మంగళవారం మృతి చెందారు. హైదరాబాద్ ఎల్బీనగర్‌లోని గోపాల్‌రెడ్డి ఇంటి వద్ద మంజులారాణి పార్థివదేహానికి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బత్తుల ఊశయ్య పూలమాల వేసి నివాళులర్పించారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

కేతేపల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన పోలగోని బలరాం కుటుంబసభ్యులకు నకిరేకల్ మార్కెట్ ఛైర్‌పర్సన్ గుత్తా మంజుల, పీఏసీఎస్ ఛైర్మన్ బోళ్ళ వెంకటరెడ్డి ఆర్థిక సాయం అందజేశారు. చీకటిగూడెంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రంలో హమాలీగా విధులు నిర్వహిస్తున్నాడు. పీఏసీఎస్ నుంచి బలరాం కుటుంబానికి మంజూరైన రూ.30వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్లు ముత్తయ్య, పర్శరాములు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కె.శ్రీనివాసయాదవ్, నాయకులు జి.మాధవరెడ్డి, బి.సుందర్, కోట పుల్లయ్య, బీరం జాన్‌రెడ్డి, జె.వెంకటనర్సయ్యయాదవ్, ఎన్.మంగమ్మ, ఎ. వెంకట్‌గౌడ్ ఉన్నారు.

### దుర్గం రిషికేష్‌కు లిటిల్ సోల్జర్స్ ఆధ్వర్యంలో..

నార్కట్‌పల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి పట్టణంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దుర్గం రిషికేష్‌కు లిటిల్ సోల్జర్స్ సంస్థ రూ.20,200ల ఆర్థిక సాయాన్ని అందజేసింది. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు బ్రహ్మదేవర నరేశ్, కర్నాటి నరేశ్, గుండు విక్రమ్, చిట్టిపోలు హరిప్రసాద్, ఆపద్బాంధవ్ ఫౌండేషన్ ఛైర్మన్ పంజాల శశికుమార్, మనం ఫౌండేషన్ ఛైర్మన్ దైద నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చండూరు రూరల్: మండలంలోని గుండ్రపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త కురుపాటి నగేష్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. బీఆర్ఎస్ మండల నాయకులు బుధవారం కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.55వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొమ్మర బోయిన వెంకన్న, పెండ్యాల గీత, యత్తపు మధుసూదన్‌రావు, ఉజ్జిని అనిల్‌రావు, బొడ్డు సతీష్, కురుపాటి సుదర్శన్, స్రామాట్ కిరణ్, ఎలువర్తి జంగయ్య, నాగరాజు, మహేశ్వరం వెంకన్న, లింగస్వామి తదితరులున్నారు.

## నిర్లక్ష్యంతోనే కొనుగోళ్లలో జాప్యం

నకిరేకల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. నకిరేకల్‌లోని చీమలగడ్డ పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. కొనుగోలులో జాప్యం అవుతుండడంతో రోజుల తరబడి రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారన్నారు. అధికారులు, మిల్లర్ల మధ్య సమన్వయ లోపంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సిలివేరు ప్రభాకర్, ప్రగడపు నవీన్‌రావు, పల్‌రెడ్డి మహేందర్‌రెడ్డి, రాచకొండ శ్రవణ్, ఇమ్మడపాక వెంకన్న పాల్గొన్నారు.

# చి'వరి'కి కన్నీళ్లే

(5వ పేజీ తరువాయి)

పంటలకు పిచికారీ చేసే మందులపై రైతులకు సరైన అవగాహన లేకపోవడంతో నష్టం తప్పడం లేదు. ఎకరానికి సాధారణంగా రూ.5వేల నుంచి రూ.7వేల వరకు మందుల పిచికారీకి వ్యయం వచ్చేంది. అయితే ఈ ఏడాది రూ.10వేల నుంచి రూ.15వేలు వెచ్చించాల్సిన దుస్థితి ఏర్పడింది.

### యాజమాన్య లోపాలు

రైతులు దశాబ్దాలుగా సేంద్రీయ ఎరువులు (పశువుల పేడ, పచ్చిరొట్ట పంటలైన జీలుగ, జనుము) వాడకపోవడంతో నేల నిస్సారమవుతోంది. విత్తన ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవడం లేదు. ఎకరానికి భాస్వరం(డీఏపీ) ఒక బస్తాకు బదులు రెండు బస్తాలు వినియోగిస్తున్నారు. హెక్టారుకు (రెండున్నర ఎకరాలకు) 120 కిలోల యూరియాకు బదులు ఎకరానికి అంత మోతాదు యూరియా వినియోగిస్తుండడంతో తెగుళ్ల వ్యాప్తి అధికమవుతోంది. పురుగు మందుల ఎంపికలో అవగాహన లేకపోవడంతో పాటు ఒకేసారి ఎక్కువ మందులు కలిపి పిచికారీ , పొటాష్ వాడకం పూర్తిగా మానేయడం, ఒకే పంట వి ధానంతో నేల స్వభావం దెబ్బతింటోందని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.

### ప్రతికూల వాతావరణం

ప్రైవేటు సన్నరకాలు వాతావరణంలో మార్పును తట్టుకోలేవు. గాలిలో తేమ అధిక శాతం ఉండటంతో పాటు ఎడతెరిపిలేని వర్షాలతో పంటల సాగు ప్రతిబంధకంగా మారింది. సాధారణంగా సన్న రకం వరి 125 రోజులకు కోతకు వస్తుంది. ఈ ఏడాది అంతగా సూర్యరశ్మి లేకపోవడంతో పంట కాల పరిమితి పెరిగింది. జూలైలో నాటిన వరి పంట ఇప్పటికే కోతకు రావాలి. అయితే 15-20 రోజులు ఆలస్యమైందని, దీంతో దిగుబడులపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.




### అవగాహన అవసరం

ఆయకట్టులో అధికంగా చిన్న, సన్నకారు రైతులు ఉండటంతో విత్తన ఎంపిక, రసాయన మందుల వాడకంపై అవగాహన ఉండటం లేదు. ప్రభుత్వ పరిశోధనా సంస్థలు రూపొందించిన నాణ్యమైన వరి విత్తనాలు సాగుచేసేలా ప్రోత్సహించి వాటికి మార్కెట్లో మద్దతు ధర కల్పించేందుకు కృషి చేయాలి. నాణ్యతలేని బయో మందుల విక్రయాలు, విత్తన కల్తీలను అరికట్టాలి. సమగ్ర ఆధునిక యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేయాలి. అప్పుడే విచ్చలవిడిగా పురుగుమందుల వినియోగం తగ్గి రైతుకు లాభం చేకూరుతుంది.

### వరి సాగుతో నష్టమే

నాకున్న ఎకరంన్నరతో పాటు మరో మూడు ఎకరాలు కౌలుకు తీసుకుని సన్న (ప్రైవేట్)రకాల వరిని సాగుచేశా. విత్తనాల్లో సుమారు 20శాతం బెరుకులు వచ్చాయి. గింజ నల్లగా ఉండటంతో పాటు పంట ఎత్తుగా పెరిగింది. గింజ లావుగా ఉండటంతో పాటు పట్టుకుంటే రాలి పోతోంది. ఈ సారి వరికి విపరీతమైన తెగుళ్ల వచ్చాయి. పురుగు మందుల పిచికారీకి బాగా ఖర్చుచేశా. అయినా పంట కోలుకోలేదు. ఎరానికి 30-35 బస్తాలకు మించి దిగుబడులు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. అధిక వర్షాలతో పంట చాలా ఆలస్యంగా వస్తోంది. ఇప్పటికే ఎకరానికి రూ.35వేల వరకు పెట్టుబడి పెట్టా. కౌలు, పెట్టుబడి పోగా ఏం మిగిలే పరిస్థితి కనిపించడం లేదు.

గుండెబోయిన రామలింగం, రైతు, త్రిపురారం





ప్రాజెక్టుల నీటిమట్టం

| ప్రాజెక్టు | పూర్తిస్థాయి | ప్రస్తుతం | ఇన్‌ఫ్లో | అవుట్‌ఫ్లో |
|---|---|---|---|---|
| | నీటి మట్టం (అడుగులు) | | (క్యూసెక్కులు) | |
| సాగర్ (టీఎంసీలు) | 590 (312.0450) | 587.50 (305.8030) | 52,560 | 52,560 |
| మూసీ (టీఎంసీలు) | 645 (4.46) | 644.42 (4.31) | 1,517.58 | 1,764.88 |
| పులిచింతల (టీఎంసీలు) | 175 (45.77) | 173.554 (43.548) | 25,230 | 24,230 |

| చికెన్ ధరలు | లైవ్ : రూ.148 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.250 |
|---|---|---|---|



# చివరికి కన్నీళ్లే

ఒకప్పుడు పల్లెలు పచ్చని పైర్లు, స్వచ్ఛమైన నేల, గాలికి నెలవుగా ఉండేవి. మారుతున్న కాలంతో పాటు ప్రస్తుతం అన్నీ కలుషితమవుతున్నాయి. వరి చేలు నేడు పురుగు మందుల వాసనతో గుప్పుమంటున్నాయి. విత్తనం నాటిన మొద లు కోతల వరకు తెగుళ్ల వ్యాప్తితో పంటలు కోలుకోవడం లేదు. రైతులు విపరీతంగా పురుగు మందులు పిచికారీ చేసినా ప్రయోజనం ఉండటం లేదు. పేరుకు హైబ్రిడ్ విత్తనాలు అయినా, దిగుబడులు ఆశించిన స్థాయిలో రావడం లేదు.

- (ఆంధ్రజ్యోతి,మిర్యాలగూడ వ్యవసాయం)

» పంటను వెంటాడిన తెగుళ్లు » విచ్చలవిడిగా పురుగుమందుల పిచికారీ » దెబ్బతింటున్న నేల స్వభావం » దిగుబడులపై తీవ్ర ప్రభావం » ఆందోళనలో రైతులు

సాగర్ ఆయకట్టులో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 6.50లక్షల ఎకరాల్లో వరి సాగవుతోంది. 1965లో సాగర్ ప్రాజెక్టు పూర్తయినా నాటి నుంచి నేటివరకు ఆయకట్టులో సుమారు ఏడు దశాబ్దాలుగా వరే ప్రధాన పంటగా సాగవుతోంది. దశాబ్దకాలం నాటి వరకు వానాకాలంలో సాంబమసూరి (బీపీటీ-5204), యాసంగిలో ఎంటీయూ-1010 వరి రకం సాగయ్యేది. తెగుళ్ల వ్యాప్తి, పెట్టుబడులు తక్కువగా ఉండి అధిక దిగుబడులు వచ్చేవి.

**ప్రైవేట్ రకాలతో తంటా..**

ఆయకట్టును ప్రస్తుతం ప్రైవేట్ సన్న రకాలు శాసిస్తున్నాయి. దశాబ్దకాలంగా 90శాతం మేర అత్యంత సన్నని వరినే రైతులు పండిస్తున్నారు. పంట కోయగానే నేరుగా మిల్లుకు తరలించే అవకాశం ఉండటంతో పాటు రైతులు పూర్తిస్థాయిలో వీటినే సాగు చేస్తున్నారు.ఈ రకాలు వ్యాపారులకు కల్పతరువుకాగా, రైతులకు మాత్రం గుదిబండగా మారాయి.

**విత్తన దిగుమతి..**

సాగర్ ఆయకట్టు వరి సాగులో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో ఉంది. అయినా, విత్తన తయారీలో ముందడుగు పడలేదు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధనా కేంద్రాలు ఏర్పాటు చేసినా, ప్రైవేటు రకాలు మాదిరిగా అత్యంత సన్నని, ఆరబెట్టకుండా విక్రయించే ధాన్యాన్ని నేటి వరకు రూపకల్పన చేయడంలో శాస్త్రవేత్తలు విఫలమయ్యారు. నేడు ఆయకట్టులో సాగు చేసే ప్రైవేటు రకాలు ఎక్కువగా మహారాష్ట్రలో రూపకల్పన చేసినవే. ఈ విత్తనాలు కరీంనగర్, వరంగల్, నిజామాబాద్‌లో ఏర్పాటు చేసిన వందలాది విత్తన కంపెనీల నుంచి ఆయకట్టుకు పెద్ద మొత్తంలో దిగుమతి అవుతున్నాయి. రైతు స్థాయిలో విత్తోనాత్పత్తి ప్రయత్నం జరగకపోవడంతో 10కిలోల విత్తనానికి రూ.1,000పైనే ధర వెచ్చించి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ఎకరా విత్తనానికి రూ.1,500 నుంచి రూ.2వేల వరకు ఖర్చు వస్తోంది.

**విత్తనంలో బెరుకులు.**

సన్న విత్తనానికి మార్కెట్లో డిమాండ్ బాగా పెరగడంతో వందలాది విత్తన కంపెనీలు పుట్టుకు వచ్చాయి. అయితే విత్తనాల్లో మాత్రం నాణ్యత ఉండటం లేదు. ఈ వానాకాలంలో ఎకరం పంటలో సుమారు 10-30శాతం వరకు బెరుకులు వచ్చాయని రైతులు చెబుతున్నారు. పంట దిగుబడులు ఎకరానికి 3క్వింటాళ్ల మేర తగ్గుతున్నాయి. మిగిలిన బెరుకు విత్తనాలు ప్రధాన విత్తనంలో కలిసిపోవడంతో మార్కెట్లో ధర రాక నష్టపోతున్నామని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**మందుల కల్తీ...**

అధిక వర్షాలతో వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా వరిలో తెగుళ్లను నియంత్రించడానికి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎకరానికి ఇప్పటి వరకు మూడు నుంచి నాలుగు పర్యాయాలు మందులు పిచికారీ చేసినా తెగుళ్లు వరుసగా వెంటాడాయి. ఒకేసారి మూడు నుంచి నాలుగు రకాల పురుగు మందులు కలపడంతో పాటు నకిలీ బయో మందులు వాడటంతో పంటలో రోగ నిరోధక శక్తి తగ్గింది. దీంతోపాటు దిగుబడులు తగ్గిపోతాయని, నేల స్వభావంతో పాటు పర్యావరణం దెబ్బ తింటోందని శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు.

- మిగతా 8వ పేజీలో...

**తెగుళ్ల బెడద...**

ప్రైవేట్ రకాలు అత్యంత సన్నవి కావడంతో ప్రతికూల వాతావరణాన్ని తట్టుకోలేకపోతున్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. పంటలో రోగనిరోధక శక్తి తక్కువగా ఉండటంతో విత్తనం నాటిన నుంచే తెగుళ్లు వెంటాడుతున్నాయి. ఈ ఏడాది వరి ప్రాథమిక దశలోనే ఆకుచుట్టు పురుగు, మొగి, పొట్టకుళ్లు, కంకినల్లి, పాము పొడ, ఎండాకు తెగులు, దోమ, కాటుక తెగుళ్లు సోకాయి. వరికి వచ్చే అన్ని రకాల తెగుళ్ల వ్యాప్తితో పంటల సాగు రైతులకు భారంగా మారింది. ఈ పరిస్థితుల్లో ఎకరానికి 30-35 బస్తాల ధాన్యం దిగుబడులు రావడం కూడా కష్టంగా మారింది.



## తూకాల్లో మోసాలకు అడ్డుకట్ట పడేనా?

» తప్పుడు తూకాలతో మోసపోతున్నామంటున్న రైతులు
» ఫిర్యాదులు అందితే తప్ప స్పందించని అధికారులు



తూకంలో తేడాలున్నట్లు రైతులు ఫిర్యాదు చేయగా మిర్యాలగూడలో వేబ్రిడ్జిని తనిఖీ చేసి తూకాలను సీజ్ చేసిన అధికారులు (ఫైల్)

మిర్యాలగూడ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇంటిల్లిపాది కష్టపడి పండించిన పంట విక్రయానికి రైతులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ధాన్యం విక్రయించేందుకు రైస్‌మిల్లుల వద్దకు వెళ్తే వేబ్రిడ్జి మోసాలకు గురిచేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. పంట కోత సమయంలో కురుస్తున్న వర్షాలతో రైతులు పంటను రక్షించుకుంటూ ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తెస్తే తేమశాతం పేరుతో రోజుల తరబడి కేంద్రాల్లోనే పడిగాపులు పడుతున్నారు. రైస్‌మిల్లుల వద్దకు తాలు, తేమ, రంగు మారిందనే కారణాలతో ధర తగ్గించడమో, లేదా తూకంలో మోసానికి పాల్పడటమో చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ట్రాక్టర్ లోడుకు 40 నుంచి 60 కిలోల వరకు తక్కువ చూపుతున్నారని రైతులు పేర్కొంటున్నారు. ధాన్యం రాబడి తగ్గినప్పుడు ధర పెంచడం, ఎక్కువ ధాన్యం వచ్చినప్పుడు రాత్రికి రాత్రే క్వింటాకు రూ.100 నుంచి రూ.200 వరకు తగ్గిస్తుండటంతో విధిలేని పరిస్థితులో మిల్లర్లు చెప్పిన ధరకే ధాన్యం విక్రయిస్తున్నారు. గతంలో తూకంలో మోసాలకు పాల్పడుతున్నారని ఫిర్యాదు చేయడంతో కొన్ని కాంటాలపై అధికారులు దాడులుచేసి జరిమానా విధించారు. కాగా, ప్రస్తుతం వానాకాలం పంటల కోతలు ప్రారంభమైనందున తూనికల, కొలతల అధికారులు స్పందించి ముందస్తు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

**ఏటా ఇదే తంతు...**

ప్రతీ సీజన్‌లో తూకం పేరుతో మోసం చేస్తున్నారని రైతుల..

మిగతా 8వ పేజీలో...

## ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



కనగల్ మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వర్షాలను దృష్టిలో ఉంచుకొని ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. బుధవారం తన ఛాంబర్‌లో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యం సరైన తేమ, నాణ్యత ప్రమాణాలు ఉంటే తక్షణమే కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలన్నారు. ఎక్కువ రోజులు కొనుగోలు కేంద్రాల్లోనే ఉంచితే వర్షానికి తడిచే ప్రమాదం ఉందన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని అప్పటికప్పుడే మిల్లులకు తరలించాలని సూచించారు. రైతులు నాణ్యతతో కూడిన ధాన్యాన్ని తీసుకురావాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, ఆర్డీవో వై.అశోక్ రెడ్డి, ధాన్యం సేకరణ జిల్లా ప్రత్యేక అధికారి నాగేశ్వరరావు, మార్కెటింగ్‌శాఖ ఏడీ ఛాయాదేవి, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ గోపికృష్ణ, జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేష్, డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి, జిల్లా సహకార అధికారి పత్యా నాయక్, తదితరులు పాల్గొన్నారు.

**జాప్యం లేకుండా దిగుమతి చేయాలి**

(ఆంధ్రజ్యోతి, కనగల్): ఐకేపీ కేంద్రాల నుంచి లారీల్లో వచ్చే ధాన్యాన్ని జాప్యం లేకుండా దిగుమతి చేసుకోవాలని మిల్లర్లను కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. బుధవారం మండలంలోని దోరెపల్లి స్టేజీ వద్ద ఉన్న శ్రీవెంకటసాయి రైస్ మిల్లును కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కొర్రీలు లేకుండా ధాన్యం దిగుమతి చేసుకోవాలన్నారు. మిల్లుకు 80వేల క్వింటాళ్ల ధాన్యం లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 20వేల క్వింటాళ్లు వచ్చిందని కలెక్టర్‌కు రైస్‌మిల్లు నిర్వాహకుడు శ్రీనివాస్ వివరించారు. ఆమె వెంట అదనపు కలెక్టర్ శ్రీనివాస్, తహసీల్దార్ పద్మ, ఎస్‌ఏ విఘ్నేశ్వర్‌రెడ్డి, ఆర్‌ఐ సునిత, యాదయ్య, ఏపీఎం షైసేశ్వర్‌రావ్, తదితరులు ఉన్నారు.

## తేమ, తాలు లేకుండా చూడాలి

జడ్పీ సీఈవో శ్రీనివాసరావు



చీకటిగూడెం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీచేస్తున్న జడ్పీ సీఈవో శ్రీనివాసరావు

కేతేపల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ధాన్యంలో నిర్ణీత శాతానికి మించి తేమ, తాలు లేకుండా చూడాలని జడ్పీ సీఈవో బి.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని చీకటిగూడెం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రంలో మౌలిక వసతులు, కొనుగోలు చేసి ధాన్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతులు కొనుగోలు కేంద్రానికి తెచ్చే ధాన్యంలో తేమ అధికంగా ఉండకుండా చూసుకోవాలన్నారు. తేమ ఎక్కువగా ఉంటే ఆరబెట్టాలని సూచించారు. అలాగే కేంద్రాల నిర్వాహకులు సైతం కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించి ట్రక్ షీట్లు తీసుకోవాలన్నారు. ధాన్యం విక్రయించిన రైతులకు సకాలంలో మద్దతు ధరతో బిల్లుల చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అంతకముందు మండల పరిషత్ కార్యాలయంలో అభివృద్ధి పనులను సమీక్ష నిర్వహించారు. ఆయన వెంట ఎంపీడీవో బి.శ్రీనివాసరావు, వ్యవసాయాధికారి బి.పురుషోత్తం, ఏఈవో బాలరాజు, తదితరులు ఉన్నారు.

## కార్తీకమాసం ప్రారంభం



కార్తీక పూజల్లో పాల్గొన్న భక్తులు

నల్లగొండ కల్చరల్, అక్టోబరు 22( ఆంధ్రజ్యోతి): కార్తీక మాస పూజలు బధవారం ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా పలు దేవాలయాల్లో కార్తీక మాసం సందర్భంగా గణపతి పూజ, అఖండ దీపారాధన, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. ఆలయాలన్నీ భక్తులతో సందడి చేశాయి. నెల రోజుల పాటు ఆలయాల్లో కార్తీక మాస పూజలు కొనసాగనున్నాయి. నల్లగొండ పట్టణంలోని పానగల్ పచ్చల సోమేశ్వర ఆలయం, ఛాయాసోమేశ్వర ఆలయం, తులసీనగర్‌లోని భక్తాంజనేయస్వామి దేవాలయం, వీటీ కాలనీ వేంకటేశ్వర స్వామి ఆలయం, రామగిరి సీతారామచంద్ర స్వామి దేవాలయం, బీట్ మార్కెట్‌లోని రామకోటి స్తూప ఆలయం, శివాజీనగర్‌లోని పార్వతి పరమేశ్వర స్వామి ఆలయంతో పాటు శైవ, వైష్ణవ ఆలయాల్లో కార్తీక మాస పూజలు శాస్త్రోక్తంగా ఆరంభమయ్యాయి.

## సాగర్ విద్యుత్ కేంద్రం ముందున్న రాళ్ల తొలగింపు

**జెన్‌కో సివిల్ డైరెక్టర్ అజయ్**



నాగార్జునసాగర్ కొత్త వంతెన వద్ద టెయిల్‌పాండ్‌కు నీరు వెళ్లే మార్గాన్ని పరిశీలిస్తున్న డైరెక్టర్ అజయ్, తదితరులు

నాగార్జునసాగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ముందున్న రాళ్లు రివర్సబుల్ పంపింగ్‌కు అడ్డుగా ఉన్నాయని, వాటిని తొలగిస్తామని జెన్‌కో సివిల్ డైరెక్టర్ అజయ్ తెలిపారు. బుధవారం ఆయన ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తిని పరిశీలించారు. అనంతరం ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ముందున్న రాళ్లు, గుట్టలను ఐదు కిలోమీటర్ల దూరం ఉన్న చింతలపాలెం వరకు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ సాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో మొత్తం ఎనిమిది టర్బైన్‌లు ఉండగా, అందులో ఏడు టర్బైన్‌లు రివర్సబుల్ పంపింగ్ సామర్థ్యం కలిగి ఉన్నాయని తెలిపారు. దీంతో జలాశయంలో నీటి లభ్యత తక్కువగా ఉన్నపుడు ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ముందు టెయిల్‌పాండ్ వరకు నిల్వ ఉన్న నీటిని రివర్సబుల్ పంపింగ్ ద్వారా తిరిగి జలాశయంలోకి తీసుకోవచ్చునని తెలిపారు. ఇలా నీటిని రివర్సబుల్ పంపింగ్ తీసుకునే సమయంలో ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి ముందు నదిలో రాళ్లు, గుట్టలు అడ్డుగా ఉండటంతో సరిపడా నీరు పంపింగ్ కావడం లేదని తెలిపారు. అందుకే ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి ముందు భాగంలో ఉన్న రాళ్లు, గుట్టల తొలగింపునకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఇందుకు ఢిల్లీకి చెందిన వ్యాప్‌కో అనే ప్రైవేటు సంస్థకు పనులు అప్పగించామని, ఆ సంస్థ రెండు నెలలక్రితం ప్రధాన జలవిద్యుత్ కేంద్రం టెయిల్ రేస్ (ప్రధాన జలవిద్యుత్ కేంద్రం నుంచి బయటకు నీరు వెళ్లే మార్గం) నుంచి 21 కిలో మీటర్ల దూరంలో ఉన్న టెయిల్ పాండ్ వరకు ఆ సంస్థ శాటిలైట్, జియాలజికల్ సర్వే నిర్వహించిందన్నారు. ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి ముందున్న రాళ్లను అవసరమైతే బ్లాస్టింగ్ చేసి తొలగిస్తామన్నారు. ఇందుకు సంబంధించిన పనులకు సుమారు రూ.6కోట్లు ఖర్చవుతుందని, త్వరలో పనులు చేపడతామని తెలిపారు. తొలగించిన రాళ్లు, గుట్టలను తొలగించి ఎక్కడ డంపింగ్ చేయాలి?, ఎంత మేరకు తొలగించాలి? అనే విషయాన్ని పరిశీలిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జెన్‌కో హైడల్ సీఈ నారాయణ, సాగర్ జెన్‌కో సీఈ మంగేష్‌కుమార్, ఎస్ఈలు రఘురాం, రామకృష్ణరెడ్డి, జెన్‌కో డీఈలు, ఇతర ఇంజనీర్లు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారంలో పీఆర్టీయూ ముందంజ

**ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి**



పీఆర్టీయూ భవన్‌లో ధర్మారెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

నల్లగొండ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో పీఆర్టీయూ టీఎస్ సంఘం ముందంజలో ఉందని ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి జిల్లా కేంద్రంలో నిర్వహించిన సంఘం జిల్లా సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న పదోన్నతులు, బదిలీలు, 317 ఉపాధ్యాయుల పరస్పర బదిలీలు, మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల బదిలీలు, కేజీబీవీ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించామన్నారు. పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీపై సీఎంతో పాటు మంత్రులతో చర్చించి అమలుకు కృషి చేస్తానన్నారు. సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు కోసం కేంద్ర విద్యాశాఖ మంత్రి కలుస్తామన్నారు.

**ధర్మారెడ్డి సేవలు మరువలేనివి**

ఉపాధ్యాయ వర్గానికి పీఆర్టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ టీరెడ్డి ధర్మారెడ్డి అందించిన సేవలు మరువలేనివని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని పీఆర్టీయూ భవన్‌లో ఏర్పాటు చేసిన ధర్మారెడ్డి విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఉపాధ్యాయుల సంక్షేమం, విద్యా వ్యవస్థ పటిష్టతకు ధర్మారెడ్డి చేసిన సేవలు నేటి తరానికి ఆదర్శంగా నిలిచాయన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, విద్యా వ్యవస్థ పరిరక్షణ కోసం పీఆర్టీయూ నిరంతరం సేవలు అందిస్తోందన్నారు. మాజీ ఎమ్మెల్సీ మోహన్ రెడ్డి మాట్లాడుతూ, ధర్మారెడ్డి ఉపాధ్యాయుల లోకానికి దిక్సూచి వంటి వారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు పలు సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వంతో రాజీలేని పోరాటం చేసి జీవోలు సాధించారన్నారు. పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పులగం దామోదర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుంకరి భిక్షంగౌడ్ మాట్లాడుతూ, ధర్మారెడ్డి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కాళం నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి మేకల జాన్‌రెడ్డి, నాయకులు సిరందాసు సత్తయ్య, పేరి వెంకట్‌రెడ్డి, జగన్‌మోహన్ గుప్తా, శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి నర్సింహారెడ్డి, వెంకట్‌రెడ్డి, మధుసూదన్‌రావు, సీతరాంచందర్‌రావు, సుదర్శన్‌రెడ్డి, యుగేందర్ రెడ్డి, ఫణికుమార్, రవీందర్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, సాయిరాంరెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నత లక్ష్యాలు ఏర్పర్చుకోవాలి

డీఈవో భిక్షపతి



విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఈవో భిక్షపతి

కొండమల్లేపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పర్చుకొని జీవితంలో ఎదగాలని డీఈవో భిక్షపతి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను ఆయన తనిఖీచేశారు. ఈ సందర్భంగా మెనూ వివరాలు, రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మంచిగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఆయన వెంట ఎస్‌వో కత్తుల సరళ, తదితరులు ఉన్నారు.

## వేబ్రిడ్జిల తనిఖీలు చేపట్టాలి



వినతిపత్రం అందజేస్తున్న లింగారెడ్డి

మిర్యాలగూడ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రైస్‌మిల్లుల వద్ద వున్న వేబ్రిడ్జిలను ముందస్తు తనిఖీ చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ మండల అధ్యక్షులు కొణతం లింగారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సబ్‌కలెక్టర్ నారాయణ్ అమిత్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మిర్యాలగూడ ప్రాంతంలో ప్రతీ సీజన్‌లో రైతులను మిల్లర్లు తూకాల్లో మోసానికి గురిచేస్తున్నారని అన్నారు. గత ఏడాది ఓ మిల్లులో ట్రాలీ ధాన్యం తూకంలో 40 కిలోలు తక్కువగా వచ్చినట్లు అధికారులు గుర్తించారని అన్నారు. ఒక్కో మిల్లు సుమారు రోజుకు రూ.1.80లక్షల వరకు తూకంలో మోసంతో దోచుకుంటున్నారని ఆరోపించారు. ఇదీ కాకుండా ట్రాక్టర్‌కు 30కిలోల చొప్పున మిల్లర్లు తరుగు తీస్తున్నారని అన్నారు. రైతులు ప్రశ్నిస్తే హమాలీ, దడవాయి ఖర్చు అని చెప్పి ట్రాక్టర్‌కు అదనంగా రూ.400 దోచుకుంటున్నారని అన్నారు. ఇదేంటని రైతులు రోడ్డెక్కితే వారిని బెదిరింపులకు గురిచేసి మిల్లును మూసివేస్తున్నారని ఆరోపించారు. మోసాలకు పాల్పడిన వేబ్రిడ్జిలను సీజ్ చేసినట్లు అధికారులు ప్రకటిస్తున్నా, జరిమానా చెల్లించి మరుసటి రోజే ప్రారంభిస్తున్నారని విమర్శించారు. వ్యాపారుల మోసాలకు రైతులు బలికాకుండా ముందస్తు తనిఖీలు చేపట్టాలని కోరారు.

## విద్యార్థులతో చెలగాటమాడుతున్న ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు

నల్లగొండ టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోందని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు అన్నారు. బుధవారం సంఘం కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయకుండా సీఎం రేవంత్‌రెడ్డి విద్యార్థులను మోసం చేస్తున్నారన్నారు. మూడేళ్లుగా రాష్ట్ర వ్యాప్తంగా రూ.8వేల కోట్లకు పైగా ఫీజులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఫీజులు రాకపోవడంతో ప్రైవేట్ కళాశాలలు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 30న విద్యాసంస్థల బంద్ నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్, సైదానాయక్, కోరే రమేష్, రవీందర్, కిరణ్, రవి, ప్రసన్న, జగన్‌నాయక్, జగదీష్, సైఫ్, నవదీప్, పాల్గొన్నారు.

## ధర్నాను విజయవంతం చేయాలి

గుర్రంపోడు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద ఈ నెల 24న చేపట్టిన ధర్నాను విజయవంతం చేయాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ నియోజకవర్గ ఇన్‌చార్జి మామిడి జగన్ మహారాజ్ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. అన్ని మండలాల నుంచి స్వచ్ఛందంగా హాజరుకావాలని కోరారు.

## దేవరకొండలో ముసురుకున్న వర్షం

దేవరకొండ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): దేవరకొండ డివిజన్‌లో మూడు రోజులుగా ముసురుతో కూడిన వర్షం కురుస్తుంది. వర్షం కురుస్తుండడంతో పత్తి రైతులు పత్తి తడుస్తుందని ఆందోళన చెందుతున్నారు. బుధవారం దేవరకొండతోపాటు పలు గ్రామాల్లో ముసురుతో కూడిన వర్షం కురుస్తుంది. వర్షం కురుస్తుండడంతో పట్టణంలోని ప్రధాన వీధులు జలమయం అయ్యాయి. గ్రామాల్లో పత్తి పంట తీస్తున్న రైతులు వర్షం కురుస్తుండడంతో పత్తి తడుస్తుందని ఆందోళన చెందుతున్నారు.

# శిలాఫలకానికే పరిమితం

● స్త్రీశక్తి భవన నిర్మాణ పనుల్లో జాప్యం ● స్థలం అప్పగింతలో జాప్యం



స్రీశక్తి భవన శిలా ఫలకం

గుర్రంపోడు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): గుర్రంపోడు మండలకేంద్రంలోని స్త్రీ శక్తి భవన నిర్మాణం దశాబ్దకాలంగా శిలాఫలకానికే పరిమితమైంది. స్థలసేకరణ సమస్యతో నిధులు మంజూరైనా భవన నిర్మాణం ముందుకు సాగడంలేదు. 2011లో అప్పటి పంచాయతీరాజ్‌శాఖ మంత్రి కుందూరు జానారెడ్డి ఏఎమ్మార్పీ క్యాంపు కాలనీలో స్త్రీ శక్తి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ.25లక్షల నిధులు మంజూరు కాగా, భవన నిర్మాణాన్ని ప్రారంభించడానికి నీటిపారుదలశాఖ నుంచి స్థలం ఇవ్వడానికి అనుమతి రావాల్సి ఉంది. ప్రభుత్వ స్థలం కావడంతో అప్పటికే ఆ స్థలం పక్కన ఉన్న పోలీస్‌స్టేషన్, ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల భవనాల నిర్మాణాలకు అనుమతి లాంఛనమేనని అందరు భావించారు. అయితే అప్పట్లో మారిన నిబంధనల మేరకు కలెక్టర్‌తోపాటు ఏఎమ్మార్పీ చీఫ్ ఇంజనీర్ అనుమతి కూడా అవసరం కావడంతో అనుమతుల్లో జాప్యం జరిగింది. ఇటీవల శిలాఫలకం సమీపంలో మరో అనువైన చోట క్యాంపు కాలనీలో 378 సర్వేనెంబర్‌లో 8గుంటల స్థలాన్ని సర్వే చేసిన అధికారులు స్థలం లభ్యత ఉందం టూ నివేదిక అందజేశారు. మారిన నిర్మాణ అంచనా వ్యయం ప్రకారం మళ్లీ రూ.35లక్షలు మంజూరయ్యాయి. చీఫ్ ఇంజనీర్ స్థాయిలో స్థలాన్ని డీఆర్‌డీవోకు అప్పగించడంలో మళ్లీ జాప్యమైంది. ఇటీవల అద్దె భవనంలో విద్యాశాఖ పరిధిలోని భవిత కేంద్రంలో సగ భాగంలో కార్యాలయానికి మార్చారు. కార్యాలయంలో సరైన వసతులులేక మహిళలు ఇబ్బందులుపడుతున్నారు.

### సొంత భవనం నిర్మించాలి



మండలకేంద్రంలో స్త్రీశక్తి కార్యాలయానికి సొంత భవనంలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఇటీవల కార్యాలయాన్ని భవిత విద్యా వనరుల కేంద్రంలోకి మార్చిన అక్కడ కూడ సరిపడా వసతులులేవు. సొంత భవనం నిర్మించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

ఉమారాణి, మహిళా సమాఖ్య నాయకురాలు

# పత్తి రైతుకు పుట్టెడు దుఃఖం



గొడకొండ్లలో పత్తిచేలో చేరిన వర్షపు నీరు

చింతపల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): చింతపల్లి మండలంలో అధిక శాతం రైతులు వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు పత్తి రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. మండలంలో 40,500 ఎకరాల్లో పత్తి, 4,500 ఎకరాల్లో కంది సాగు చేసుకుంటున్నారు. పత్తి చేతికొచ్చే సమయంలో ఇటీవలి వర్షాలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పత్తి విక్రయించాలంటే సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రభుత్వం పత్తి క్వింటాకు రూ.8,100కు పైగా మద్దతు ధర ప్రకటించి రోజులు గడుస్తున్నా, అధికారుల నిర్లక్ష్యం కారణంగా సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు కావడంలేదని రైతులు వాపోతున్నారు. దీంతో దళారులు ఇదే అదునుగా భావించి, పత్తి క్వింటాకు రూ.5,000 నుంచి రూ.5,200 మాత్రమే చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. రైతు లు చెమటోడ్చి పండించిన పత్తికి మద్దతు ధర ఉన్నప్పటికీ సీసీఐ కేంద్రాలు లేక, వర్షాల కారణంగా నష్టపోతున్నారు. అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

### అధికారులు స్పందించాలి



నాలుగు ఎకరాల్లో రూ.1.5లక్షల వరకు పెట్టుబడులు పెట్టి పత్తి సాగు చేశా. పత్తి మొక్కలు ఏపుగా పెరిగి చేతికొచ్చే సమయానికి కురుస్తున్న వర్షాలకు పత్తి తడిసిపోయింది. దళారులు ఇష్టారాజ్యంగా ధరలు నిర్ణయిస్తూ పత్తిని కొనుగోలు చేస్తున్నారు. వెంటనే సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి.

వల్లపు శ్రవణ్‌కుమార్, రైతు గొడకొండ్ల.

### వ్యాపారులకు విక్రయించొద్దు

గ్రామీణ ప్రాంతాల రైతులు తమ పత్తిని వ్యాపారులకు విక్రయించొద్దు. తీసిన పత్తిని తడిలేకుండా ఇంట్లో గదిలో నిల్వ చేసుకోవాలి. సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధంచేశాం. రైతులు కొనుగోలు కేంద్రాల విషయంలో ఆందోళన చెందవద్దు.

వేణుకుమార్, మాల్ మార్కెట్ కార్యదర్శి

## మాలధారులకు అన్నప్రసాద వితరణ



అన్నదానం చేస్తున్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

దామరచర్ల, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కోదండ రామాలయంలో మాలధారణ స్వాములకు బుధవారం ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్ అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 41రోజులపాటు నిర్వహించే ఈ అన్నదాన కార్యక్రమంలో స్వాములు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. అనంతరం ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ అన్నప్రసాద వితరణ కోసం రూ.50వేలను విరాళంగా అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు, భక్తులు, స్వాములు పాల్గొన్నారు.

## కపాస్ కిసాన్ యాప్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

దామరచర్ల, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రూపొందించిన కపాస్ కిసాన్ యాప్‌పై బుధవారం మండలంలోని ఇర్కిగూడెం గ్రామంలోని రైతులకు ఏవో రుషేంద్రమణి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కపాస్ కిసాన్ యాప్‌ను రైతులు మొబైల్‌లోని ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని, తద్వారా రిజిస్ట్రేషన్ చేసుకొని స్లాట్ బుకింగ్ ద్వారా రైతులు తాము పండించిన పత్తిని సీసీఐలో విక్రయించుకోవచ్చన్నారు.కార్యక్రమంలో ఏఈవో పార్వతి, పంచాయతీ సెక్రటరీ జానకిరాములు, రైతులు కోటిక సైదయ్య, సాంబశివరావు, పరమేశరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

## బడుగుల కోసం శంకరన్ కృషి మరువలేం

మిర్యాలగూడ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్ శంకరన్ పదవీకాలమంతా బడుగు, బలహీన వర్గాల కోసమేనని, ఆయన చేసిన సేవలు ఎన్నటికీ మరువలేనివని సామాజికవేత్త రాజు, విద్యావికాస వేదిక రాష్ట్ర కన్వీనర్ కస్తూరి ప్రభాకర్ అన్నారు. బుధవారం స్థానిక కేఎల్ఎన్ జూనియర్ కళాశాలలో జన విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో కొమరం భీమ్, ఎస్ఆర్ శంకరన్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బొగ్గు గనులను జాతీయం చేయడంలో శంకరన్ చేసిన కృషి గొప్పదన్నారు. కళాశాల కరస్పాండెంట్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ జల్, జంగల్, జమీన్‌కోసం పోరాడిన యోధుడు కొమరం భీమ్ అని అన్నారు. అనంతరం కొమరం భీమ్ జీవిత చరిత్ర పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనవిజ్ఞానవేదిక తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కందుకూరి సుదర్శన్, కళాశాల అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

తూకాల్లో

## మోసాలకు అడ్డుకట్ట పడేనా?

(5వపేజీ తరువాయి)

నుంచి అధికారులకు ఫిర్యాదులు అందుతున్నాయి. ఆసియా ఖండంలోనే అత్యధికంగా రైస్‌మిల్లులు ఉన్న మిర్యాలగూడ ప్రాంతంలో ఏడాదిలో రెండు పంటల కాలంలో లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లర్లు కొనుగోలు చేస్తున్నారు. ట్రాక్టర్ ట్రాలీలో తెచ్చిన ధాన్యం మచ్చు చూసి ధర నిర్ణయించి వెంటనే అదే రైస్‌మిల్లులకు చెందిన వేబ్రిడ్జిపై కాంటా వేసి అన్‌లోడ్ చేయిస్తున్నారు. ధర నిర్ణయ సమయంలోనే కొంత ధర తగ్గించే మిల్లర్లు తూకంలో మోసాలకు గురిచేస్తున్నారని చాలాకాలంగా రైతులు మొరపెట్టుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. గత ఏడాది ఓ మిల్లులోని వేబ్రిడ్జి నిర్వాహకులు తూకంలో మోసానికి పాల్పడుతున్నట్లు ఆరోపించడంతో జిల్లా అధికారులు తనిఖీలు నిర్వహించగా, ట్రాలీకి 40 కిలోల వరకు తక్కువ తూకం వచ్చిందని తేల్చారు. వేబ్రిడ్జిని సీజ్ చేయడమేగాక, రూ.1,25,000 జరిమానా విధించారు. అప్పటికే ఆ మిల్లు యజమాని భారీగా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేశాడు.

### గత ఏడాది 381 కేసులు

జిల్లాలో 2024-25లో వివిధ విభాగాల్లో తూకాల్లో తేడాలు జరుగుతున్న విషయమై తూనికల కొలతల అధికారులు 381 కేసులు నమోదు చేసి రూ.42.66లక్షలు జరిమానా విధించారు. తూనికల అధికారుల హెచ్చరికలను ఖాతరు చేయకుండా వేబ్రిడ్జీల నిర్వాహకులు మోసాలకు పాల్పడుతున్నారని, అలాంటి వారిపై మరింత కఠినంగా చట్టాలను ప్రయోగించాలని రైతులు కోరుతున్నారు. అత్యధికంగా మిల్లులు ఉన్న మిర్యాలగూడలో ప్రత్యేకంగా తూనికల, కొలతల కార్యాలయం ఏర్పాటు చేయకుండా కాంటాల నిర్వాహకులపై అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. తూకంలో తేడాలు గుర్తించి ప్రజలు ఫిర్యాదు చేస్తే తప్ప ముందస్తు తనిఖీలు చేపట్టడంలేదని పేర్కొంటున్నారు.

### తూకంలో తేడాలు వస్తే ఫిర్యాదు చేయండి

ఏడాదికి ఒకసారి వేబ్రిడ్జిలను చెక్‌చేసి స్టాంపింగ్ చేస్తాం. ఇప్పటివరకు జిల్లా 200 వరకు స్టాంపింగ్ చేశాం. తూకంలో తేడాలు ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే ఫిర్యాదు చేయాలి. తక్షణమే చర్యలు తీసుకుంటాం. తేడాలున్నట్లు తేలితే సదరు కాంటాల నిర్వాహకులపై చర్యలు తీసుకుంటాం. జరిమానా విధించడంతో పాటు వేబ్రిడ్జిని సీజ్ చేస్తాం. తూనికలు కొలతల్లో మోసాలు జరిగితే సహించేదిలేదు. కఠిన చర్యలు తీసుకుంటాం.

శ్రీనివాస్, జిల్లా తూనికల కొలతల అధికారి

# ఆదివాసీ ఆత్మగౌరవ ప్రతీక కొమరం భీమ్



మిర్యాలగూడలో కొమరం భీమ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

మిర్యాలగూడ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఆదివాసీ ఆత్మగౌరవ ప్రతీక కొమరం భీమ్ అని తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్రనేత బెల్లంకొండ హరికృష్ణ అన్నారు. బుధవారం స్థానిక విజేత డిగ్రీ కళాశాలలో కొమరంభీమ్ యాది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయంపాలన, అస్థిత్వ ఉద్యమాల వేగుచుక్కగా కొమరం భీమ్ నిలిచారన్నారు. జల్, జంగల్, జమీన్ హమారా అంటూ నిజాం నవాబులపై పోరాటం కొనసాగించిన ఫలితంగానే రాజ్యాంగంలో ఆదివాసీలకు 5, 6వ షెడ్యూల్ రూపొందించారన్నారు. పోడు భూములకు పట్టాలు లభించాయన్నారు. ఆదివాసీలను అడవికి దూరం చేసి, అటవీ సంపదను కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేస్తోందన్నారు. కొమరం భీమ్ స్ఫూర్తితో ప్రజలు ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ధనుంజయ, ప్రభాకర్, రమేష్, రాజారాం, సతీష్, యాదయ్య, దుర్గయ్య, వీరయ్య, సైదమ్మ, వాసుపాల్గొన్నారు.

దేవరకొండ: ఆదివాసీల హక్కులకోసం పోరాడిన మహావీరుడు కొమరం భీం అని ఏబీవీపీ నల్లగొండ జిల్లా హాస్టల్ల విభాగ్ కన్వీనర్ యలమల గోపిచంద్ అన్నారు. బుధవారం దేవరకొండలో ఏబీవీపీ ఆధ్వర్యంలో కొమరం భీం జయంతి వేడుకలను నిర్వహించారు. కొమరం భీం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. గోండుల హక్కుల రక్షణకోసం నిజాం ప్రభుత్వాన్ని ఎదురించాడన్నారు. గిరిజనుల ఆస్తి, భూమి, అడవులపై హక్కులకోసం ఉద్యమాన్ని ప్రారంభించారన్నారు. ఆయన చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ దేవరకొండ నగర జాయింట్ కార్యదర్శి హేమ సుందర్, విక్రమ్, రాకేష్, నర్సింహ, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో

## విద్యార్థుల సంఖ్య పెంచాలి

● ఎంఈవో తరి రాములు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో తరి రాములు

పెద్దవూర, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని ఎంఈవో తరి రాములు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో పలు ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బడి బయట ఉన్న పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారికి నాణ్యమైన విద్య అందేలా కృషి చేయాలన్నారు. ఎఫ్ఆర్ఎస్ హాజరును పాటించాలని సూచించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. విద్యార్థుల అపార్ ఐడీ జనరేట్ చేయాలని, పాఠ్య పుస్తకాలు పార్ట్-2 తీసుకెళ్లి ఆన్‌లైన్ చేయాలని, ఎస్ఏ పరీక్షలను సమర్థంగా నిర్వహించాలని, ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం మండలంలో మెరుగ్గా ఉండేలా కృషి చేయాలన్నారు. మూతబడిన పాఠశాలలను తల్లిదండ్రుల సహకారంతో పునః ప్రారంభించి పాఠశాలల్లో విద్యార్థుల హాజరుశాతాన్ని పెంచాలని ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో మండల నోడల్ ఆఫీసర్ శేషు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఝాన్సీలక్ష్మి, శ్రీనివాస్, పాపిరెడ్డి, కృష్ణ, దుర్గాప్రసాద్, సుధాకర్, గోలి కృష్ణ, సీఆర్‌పీలు శంకర్, వెంకటయ్య, రమ్య తదితరులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



డ్రగ్స్ నివారణపై రూపొందించిన ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

మిర్యాలగూడ టౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని నషా ముక్త్ భారత్ అభియాన్ జిల్లా కౌన్సిలర్ భరత్‌తేజ అన్నారు. పట్టణంలోని ఆదిత్య ఉన్నత పాఠశాలలో బుధవారం 'మాదక ద్రవ్యాలు-దుష్ప్రభావాలు' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్‌పై అవగాహన ఉంటే విద్యార్థులు వాటి జోలికి వెళ్లరన్నారు. మత్తు పదార్థాల వినియోగం చెడు ప్రభావం చూపుతుందని, జీవితాన్ని నాశనం చేస్తుందన్నారు. పాఠశాల కరస్పాండెంట్ మారుతి అమరేందర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ, దివ్యాంగుల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంతో డ్రగ్స్ రహిత సమాజ ఏర్పాటు జరగాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బంటు నాగరాజు, వైస్ ప్రిన్సిపాల్ కట్టా అనిత తదితరులు పాల్గొన్నారు.

## ఏఐఐఈఏ నూతన కార్యవర్గం

మిర్యాలగూడ టౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్(ఏఐఐఈఏ) మిర్యాలగూడ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. బ్రాంచి నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎం.బీమ్లానాయక్, అమృతం రవీంద్ర ఎన్నికయ్యారు. కార్యక్రమానికి హాజరైన సంఘం డివిజన్ జనరల్ సెక్రటరీ డీఎస్ రఘు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఏఐఐఈఏ అలుపెరగని పోరాటం చేస్తోందన్నారు. సంస్థ అభివృద్ధికి కృషి చేస్తూనే పాలసీదారుల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తున్న ఏకైక సంఘం తమదేనన్నారు. బీమా ప్రీమియంపై జీఎస్టీ కుదింపు ఏఐఐఈఏతోనే సాధ్యమైందన్నారు. జిల్లా సంయుక్త కార్యదర్శి పెరుమాళ్ల బాలస్వామి మాట్లాడుతూ సంస్థలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘ కోశాధికారి జావేద్, మాజీ అధ్యక్షుడు యోగీశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చి'వరి'కి కన్నీళ్లే

(5వపేజీ తరువాయి)

పంటలకు పిచికారీ చేసే మందులపై రైతులకు సరైన అవగాహన లేకపోవడంతో నష్టం తప్పడం లేదు. ఎకరానికి సాధారణంగా రూ.5వేల నుంచి రూ.7వేల వరకు మందుల పిచికారీకి వ్యయం వచ్చేంది. అయితే ఈ ఏడాది రూ.10వేల నుంచి రూ.15వేలు వెచ్చించాల్సిన దుస్థితి ఏర్పడింది.

### యాజమాన్య లోపాలు

రైతులు దశాబ్దాలుగా సేంద్రీయ ఎరువులు (పశువుల పేడ, పచ్చి రొట్ట పంటలైన జీలుగ, జనుము) వాడకపోవడంతో నేల నిస్సారమవుతోంది. విత్తన ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవడం లేదు. ఎకరానికి భాస్వరం (డీఏపీ) ఒక బస్తాకు బదులు రెండు బస్తాలు వినియోగిస్తున్నారు. హెక్టారుకు (రెండున్నర ఎకరాలకు) 120 కిలోల యూరియాకు బదులు ఎకరానికి అంత మోతాదు యూరియా వినియోగిస్తుండటంతో తెగుళ్ల వ్యాప్తి అధికమవుతోంది. పురుగు మందుల ఎంపికలో అవగాహన లేకపోవడంతో పాటు ఒకేసారి ఎక్కువ మందులు కలిపి పిచికారీ చేయడం, పొటాష్ వాడకం పూర్తిగా మానేయడం, ఒకే పంట విధానం వంటి చర్యలతో నేల స్వభావం దెబ్బతింటోందని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.

### ప్రతికూల వాతావరణం

ప్రైవేటు సన్నరకాలు వాతావరణంలో మార్పును తట్టుకోలేవు. గాలిలో తేమ అధిక శాతం ఉండటంతో పాటు ఎడతెరిపిలేని వర్షాలతో పంటల సాగు ప్రతిబంధకంగా మారింది. సాధారణంగా సన్న రకం వరి 125 రోజులకు కోతకు వస్తుంది. ఈ ఏడాది అంతగా సూర్యరశ్మి లేకపోవడంతో పంట కాల పరిమితి పెరిగింది. జూలైలో నాటిన వరి పంట ఇప్పటికే కోతకు రావాలి. అయితే 15-20 రోజులు ఆలస్యమైందని, దీంతో దిగుబడులపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### అవగాహన అవసరం

ఆయకట్టులో అధికంగా చిన్న, సన్నకారు రైతులు ఉండటంతో విత్తన ఎంపిక, రసాయన మందుల వాడకంపై అవగాహన ఉండటం లేదు. ప్రభుత్వ పరిశోధనా సంస్థలు రూపొందించిన నాణ్యమైన వరి విత్తనాలు సాగుచేసేలా ప్రోత్సహించి వాటికి మార్కెట్లో మద్దతు ధర కల్పించేందుకు కృషి చేయాలి. నాణ్యతలేని బయో మందుల విక్రయాలు, విత్తన కల్తీలను అరికట్టాలి. సమగ్ర ఆధునిక యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేయాలి. అప్పుడే విచ్చలవిడిగా పురుగు మందుల వినియోగం తగ్గి రైతుకు లాభం చేకూరుతుంది.

### వరి సాగుతో నష్టమే

నాకున్న ఎకరంన్నరతో పాటు మరో మూడు ఎకరాలు కౌలుకు తీసుకుని సన్న (ప్రైవేట్)రకాల వరిని సాగుచేశా. విత్తనాల్లో సుమారు 20శాతం బెరుకులు వచ్చాయి. గింజ లావుగా ఉండటంతో పాటు పట్టుకుంటే రాలి పోతోంది. ఈ సారి వరికి విపరీతమైన తెగుళ్లు వచ్చాయి. పురుగు మందుల పిచికారీకి బాగా ఖర్చుచేశా. అయినా పంట కోలుకోలేదు. ఎరానికి 30-35 బస్తాలకు మించి దిగుబడులు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. అధిక వర్షాలతో పంట చాలా ఆలస్యంగా వస్తోంది. ఇప్పటికే ఎకరానికి రూ.35వేల వరకు పెట్టుబడి పెట్టా. కౌలు, పెట్టుబడి పోగా మిగిలే పరిస్థితి లేదు.

గుండెబోయిన రామలింగం, రైతు, త్రిపురారం

## మద్యపానం ఆరోగ్యానికి హానికరం




ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

దేవరకొండ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మద్యపానం, గంజాయి ఆరోగ్యానికి హానికరమని ఎన్ఎస్ఎస్ క్యాంపు నిర్వాహకుడు డాక్టర్ మకట్‌లాల్ అన్నారు. మత్తు పదార్థాల వల్ల నష్టాలు జరుగుతాయని ఎన్ఎస్ఎస్ వలంటీర్లు నినాదాలు చేస్తూ అవగాహన కల్పించారు. బుధవారం దేవరకొండ మండలం ముదిగొండలో ఎంకేఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ శిబిరం నిర్వహించి విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మకట్‌లాల్ మాట్లాడుతూ మద్యపానం, గంజాయి, మాదక ద్రవ్యకాలు తీసుకోవడం వల్ల ఆరోగ్యం దెబ్బతిని నష్టపోతారన్నారు. బాల్య వివాహాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అరిఫా, పంచాయతీ కార్యదర్శి సతీష్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రైతులు మద్దతు ధర పొందాలి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సత్యం

నిడమనూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి ప్రభుత్వ కనీస మద్దతు ధర పొందాలని మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం అన్నారు. మండలంలోని ఊట్కూరు, మార్లాక గ్రామాల్లో బుధవారం ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. రైతు ఉత్పత్తులకు మద్దతు ధర అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతీ సీజన్‌లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి చివరి ధాన్యం గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. దళారులను నమ్మి రైతులు మోసపోవద్దన్నారు. కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ జంగాల కృష్ణయ్య, ఎంపీడీవో బోనగిరి రమేష్, ఏపీఎం నరహరి, సీసీ మల్లీశ్వరి, నందికొండ మట్టారెడ్డి, మేరెడ్డి వెంకట్‌రాహుల్, మేరెడ్డి వెంకటరెడ్డి, నర్సింగు విజయ్ కుమార్, శివమారయ్య, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింగు కృష్ణయ్య పాల్గొన్నారు.

## తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

నిడమనూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండేటి శ్రీను, మండల కార్యదర్శి కందుకూరి కోటేష్ కోరారు. మండలకేంద్రంలోని మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యం రాశులను బుధవారం పార్టీ నాయకులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం వర్షాలకు తడిసిపోవడంతో రైతులకు తీరని నష్టం వాటిల్లిందన్నారు. సకాలంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో నాయకులు కుంచం మహేష్, చరణ్‌రాజ్, వెంపటి మహేష్, రాజేష్ పాల్గొన్నారు.

## పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మిర్యాలగూడ టౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మునిసిపల్ కమిషనర్ గణవేణి శ్రీనివాస్ అన్నారు. ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన పథకంపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు రంగాల్లో పనిచేస్తూ 18 నుంచి 70 ఏళ్లలోపు కార్మికులు ఈ పథకానికి అర్హులన్నారు. కార్యక్రమంలో అధికారులు వెంకటరమణ, జ్ఞానేశ్వరి, శ్వేత, పాపయ్య, వెంకన్న, చారి తదితరులు పాల్గొన్నారు.

## పరిమితికి మించితే కఠిన చర్యలు

దేవరకొండ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఆటోలు, వాహనాల్లో నిబంధనలకు విరుద్ధంగా పరిమితికి మించి ప్రయాణికులను చేరవేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని దేవరకొండ సీఐ వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం సాయంత్రం దేవరకొండ పట్టణంలోని మీనాక్షి సెంటర్‌లో వాహనాల తనిఖీ నిర్వహించి సామర్థ్యానికి మించి ఆటోల్లో ప్రయాణికులను చేరవేస్తున్న డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇచ్చి మాట్లాడారు. తనిఖీల్లో దేవరకొండ ఎస్ఐ నారాయణరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నిడమనూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లడంతోపాటు అతివేగంగా ప్రయాణం చేస్తున్న నాలుగు ఆటోలను సీజ్ చేసినట్లు నిడమనూరు ఎస్ఐ ఉప్పు సురేష్ తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు మండలకేంద్రంలో బుధవారం రహదారులపై నిబంధనకు విరుద్ధంగా పరిమితికి మించి ప్రయాణికులతో వెళ్తున్న ఆటోలను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు.